

మా కలం.. మీ వజ్రాయుధం..

APTEL 2022 / 16169

# టుడే పల్లె సాక్షి

తెలుగు దిన పత్రిక

pallesakshi2022@gmail.com

youtub : pallesakshi news








PUBLISHED FROM : AMARAVATHI, VIJAYAWADA, HYD, KURNOOL, NANDYALA, KADAPA, ANANTAPUR, CHITOOR, ALL DISTRICTS IN ANDHRA PRADESH & TELANGANA

కర్నూలు : ఎడిటర్ : ఐ.లింగమూర్తి | సంపుటి : 5 సంచిక : 69 | పేజీలు : 8 | వెల రూ.4/- | email : pallesakshi2022@gmail.com | గురువారం 06-08-2026


# తూర్పు పశ్చిమలను...

# కలిపేద్దాం..!!

**జాతీయస్థాయిలో దీనిపైనే చర్చ... మనమూ అందిపుచ్చుకోవాలి**

## రోడ్డు, రైలు ప్రాజెక్టుల్ని అనుసంధానించాలి...పెట్టుబడులు సాధించాలి

## విశాఖ ఎకనమిక్ రీజియన్‌పై సమీక్షలో సీఎం చంద్రబాబు



**అమరావతి** : తూర్పు నుంచి పశ్చిమ భారతానికి అనుసంధానతను దృష్టిలో



ఉంచుకుని రోడ్డు, రైలు మార్గాలను కలిపే ప్రణాళికలు తయారు చేయాలని, పెట్టుబడులు సాధించేలా, ప్రాజెక్టులు ఏర్పాటయ్యేలా చూడాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు సూచించారు. "మనం చేస్తున్న అభివృద్ధి, చేపడుతున్న ప్రాజెక్టులు, వాటివల్ల కలిగే ప్రయోజనాలు, ఉపాధి, ఉద్యోగ అవకాశాలను ప్రజలకు వివరంగా ఎప్పటికప్పుడు చెప్పాలి" అని నిర్దేశించారు. ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం ఆయన విశాఖ ఎకనమిక్ రీజియన్ (వీఈఆర్) అభివృద్ధి ప్రణాళికలపై సమీక్షించారు. సీఆర్‌జెడ్ రీ-క్లాసిఫికేషన్, వైజాగ్ బే సిటీపై చర్చించారు. "ఈస్ట్ టు వెస్ట్ కనెక్టివిటీపై ఇప్పుడు జాతీయ స్థాయిలో చర్చ జరుగుతోంది. ప్రధాని మోదీ కూడా ఇటీవల ఇదే అంశాన్ని ప్రస్తావించారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రాజెక్టుల రూపకల్పన.. పెట్టుబడుల సాధనకు ప్రణాళికలను సిద్ధం చేయండి" అని సూచించారు. "బే సిటీ కోసం ప్రత్యేక ఎగ్జిక్యూటివ్ కమిటీ ఏర్పాటు చేయండి. అన్ని ప్రాజెక్టులను అనుసంధానం చేస్తే మెరుగైన ఫలితాలు వస్తాయి. జీసీసీ, ఫిన్‌టెక్, లాజిస్టిక్స్ ఇంటిగ్రేషన్ రంగాలపై దృష్టి సారించాలి. విశాఖలో జంతు ప్రదర్శనశాలను అభివృద్ధి చేయాలి. అంతర్జాతీయ నగరంగా ఎదుగుతున్న విశాఖలో ఇది మంచి పర్యాటక ప్రాజెక్టు అవుతుంది" అని చెప్పారు. "విశాఖపట్నం ఎకనమిక్ రీజియన్ పరిధిలో శ్రీకాకుళం జిల్లాలోని మూలపేట పోర్టు నుంచి రాజమహేంద్రవరంలోని అఖండ గోదావరి ప్రాజెక్ట్ వరకూ ప్రతి ప్రాంతం.. ప్రతి టూరిజం స్పాట్, ప్రతి రంగాన్నీ అభివృద్ధి చేసేలా, పెట్టుబడులు వచ్చేలా చూడాలి. వీఈఆర్‌లో వైజాగ్ బే సిటీ కీలకంగా ఉంటుంది. ఈ ప్రాజెక్ట్ ద్వారా రీజియన్ పరిధిలో పెద్ద ఎత్తున పట్టణాభివృద్ధి పనులు జరగాలి. కేంద్ర నిధుల్ని మరింతగా రాబట్టాలి" అని చంద్రబాబు నిర్దేశించారు. సీఎం చేసిన సూచనలివీ.. విశాఖ ఎకనమిక్ రీజియన్ సమగ్రాభివృద్ధికి సూక్ష్మ స్థాయి ప్రణాళికలను రూపొందించాలి. వీఈఆర్ పరిధిలో ఉన్న 6 పట్టణాభివృద్ధి సంస్థల్లో అద్భుతమైన అభివృద్ధి

..2వ పేజీలో



### ప్రధాని మోదీ వీడియో తొలగింపుపై

# మెటా క్షమాపణ..!!

**డీప్‌ఫేక్, ఆ కంటెంట్‌పై కీలక హామీలు**

**ప్రధాని నరేంద్ర మోదీ వీడియో తాత్కాలికంగా తొలగించిన ఘటనపై మెటా భారత ప్రభుత్వానికి క్షమాపణ చెప్పినట్లు సమాచారం. ఐటీ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో జరిగిన సమావేశంలో డీప్‌ఫేక్‌లు, బాలల లైంగిక వేధింపుల కంటెంట్, అక్రమ పోస్టుల నియంత్రణలో లోపాలపై కూడా చర్చ జరిగింది.**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి సంబంధించిన వీడియోను తాత్కాలికంగా ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌ల నుంచి తొలగించిన ఘటనపై మెటా భారత ప్రభుత్వానికి క్షమాపణలు తెలిపినట్లు సమాచారం. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన సమన్ల నేపథ్యంలో మెటా గ్లోబల్ బృందం బుధవారం కేంద్ర ఐటీ మంత్రి అశ్విని వైష్ణవ్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారులతో సమావేశమైంది. సమావేశంలో ప్రధాని మోదీ వీడియో తొలగింపు మాత్రమే కాకుండా, సోషల్ మీడియా వేదికలపై పెరుగుతున్న డీప్‌ఫేక్ వీడియోలు, బాలల లైంగిక వేధింపులకు సంబంధించిన కంటెంట్, ఇతర అక్రమ పోస్టులను అరికట్టడంలో ఉన్న లోపాలపై కూడా ప్రభుత్వం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసినట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. తమ ప్లాట్‌ఫారమ్‌లలో జరిగిన కార్యాచరణ లోపాలపై మెటా ప్రతినిధులు విచారం వ్యక్తం చేశారు. అలాగే అక్రమ కంటెంట్ నియంత్రణను మరింత బలోపేతం చేస్తామని

..2వ పేజీలో



### 'తుమ్మిడిహెట్టి'కి మహారాష్ట్రను

# ఒప్పించండి

**నాలుగు ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులు ఇవ్వండి**

**కేంద్ర మంత్రులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వినతి**

**సీఆర్ పాటిల్, భూపేందర్‌యాదవ్‌లతో భేటీ**

..2వ పేజీలో

**దిల్లీ:** రాష్ట్రానికి సంబంధించిన ఐదు ముఖ్యమైన ప్రాజెక్టుల అనుమతుల విషయమై.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిల్లీలో ఇద్దరు కేంద్రమంత్రులను కలిసి చర్చించారు. రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తదితరులతో కలిసి సీఎం బుధవారం ఉదయం కేంద్ర మంత్రులతో భేటీ అయి.. వినతిపత్రాలు ఇచ్చారు. ప్రాణహిత నదిపై తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్ర నుంచి అనుమతులు ఇప్పించాలని జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌కు, పాలమూరు-రంగారెడ్డి, గౌరవెల్లి, సీతమ్మ సాగర్, డిండి ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులు మంజూరు చేయాలని కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్‌కు విజ్ఞప్తి చేశారు. ముఖ్యమైన ప్రాజెక్టులకు వాటి నిర్మాణపనులు ప్రారంభమైన తర్వాత కూడా పర్యావరణ అనుమతులివ్వడానికి వెసులుబాటు కల్పిస్తూ సుప్రీంకోర్టు ఇటీవల తీర్పునిచ్చిన నేపథ్యంలో ముఖ్యమంత్రి రాష్ట్ర ప్రాజెక్టుల అంశాన్ని కేంద్రమంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. "తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తు పెంపు తెలంగాణకు అత్యవసరం. కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని ఈ ప్రాజెక్టుకు మహారాష్ట్ర నుంచి అనుమతులు ఇప్పించాలి" అని సీఆర్‌పాటిల్‌ను కోరారు. దీనిపై తాను ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి రాసిన లేఖ, ప్రధానమంత్రి కార్యాలయం స్పందించి దాన్ని జలశక్తి శాఖ పరిశీలనకు పంపిన విషయాన్ని పాటిల్ వద్ద ముఖ్యమంత్రి ప్రస్తావించగా.. ఆ లేఖ అందిందని ఆయన అంగీకరించారు. తుమ్మిడిహెట్టి వద్ద 148 మీటర్ల ఎత్తున బ్యారేజీ నిర్మాణానికి గతంలోనే



## అదే అరాచకం.. అంతులేని పైశాచికం

**మాజీ సీఎం జగన్ పర్యటనలో వైకాపా శ్రేణుల వీరంగంతో ప్రజల బెంబేలు**

**వాహనాలతో స్టంట్లు చేస్తూ రెచ్చిపోయిన మూక**

**రాజమహేంద్రవరం** : తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లిలో వైకాపా అధ్యక్షుడు, మాజీ సీఎం జగన్ పర్యటనలో ఆ పార్టీ కార్యకర్తలు సామాన్యులపై దాష్టీకం ప్రదర్శించారు. జగన్ దేవరపల్లి పొగాకు బోర్డులో రైతులను కలిసేందుకు బుధవారం వచ్చినప్పుడు ఆ పార్టీ కార్యకర్తలు సమీపంలోని ఓ అల్పాహార దుకాణం పైకెక్కి నృత్యాలు చేశారు. నిర్వాహకులైన మహిళలు వారిని అడ్డుకునేందుకు ప్రయత్నిస్తే సామగ్రిని ధ్వంసం చేశారు. అక్కడున్న దేవతల చిత్రపటాలనూ నేలపై పడేశారు. బాధితులు వైకాపా జెండాకర్ర తీసుకుని తిరగబడడంతో వారంతా కిందకి దూకి పరుగులు తీశారు. హోటల్లో వస్తువులు, సరకులు అన్నీ పాడైపోయాయని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. అయితే.. సాయంత్రానికి మాత్రం వారు మాటమార్చి ఓ వీడియో విడుదల చేశారు. 'జగన్ అంటే మాకు ఇష్టం.. ఆయన వల్ల లబ్ధి పొందాం. ఇదంతా ఎవరో తాగుబోతులు చేసిన పని. మాకు నష్టపరిహారం ఏమీ అవసరం లేదు. మేము ఏ మీడియాకూ చెప్పలేదు.. మమ్మల్ని ఎవరూ కొట్టలేదు.. కావాలంటే ఎవరి

..2వ పేజీలో

# నైతిక విలువలతోనే సంపూర్ణ...

# విద్యా వికాసం..!!

**మంత్రి లోకేశ్‌తో చాగంటి కోటేశ్వరరావు**

ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లో చాగంటి కోటేశ్వరరావు దిశానిర్దేశంలో రూపొందించిన నైతిక విలువల పాఠ్యాంశాలను 'నో బ్యాగ్ డే' రోజున బోధిస్తున్న సంగతి తెలిసిందే. నైతిక విలువలతో కూడిన విద్య ద్వారానే సమగ్ర విద్యా వికాసం సాధ్యమని నమ్మిన ప్రభుత్వం చేస్తున్న కృషిలో భాగస్వామి కావడం పట్ల చాగంటి సంతోషం వ్యక్తం చేశారు. భేటీ ముగిసిన అనంతరం మంత్రి లోకేశ్ స్వయంగా చాగంటి గారిని కారు వద్దకు వచ్చి వినయపూర్వకంగా సాగనంపారు.

- విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌తో చాగంటి కోటేశ్వరరావు భేటీ
- నైతిక విలువలతో కూడిన విద్య ఆవశ్యకతపై కీలక చర్చ
- విద్యార్థులను బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం
- ప్రభుత్వ పాఠశాలల్లో నైతిక విలువల బోధనపై సమీక్ష

**అమరావతి** : ఉండవల్లి ప్రముఖ ప్రవచనకర్త, నైతిక విలువల సలహాదారు బ్రహ్మశ్రీ చాగంటి



కోటేశ్వరరావు మంగళవారం రాష్ట్ర విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్‌తో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఉండవల్లిలోని మంత్రి నివాసంలో జరిగిన ఈ సమావేశంలో.. విద్యా వ్యవస్థలో నైతిక విలువల ప్రాముఖ్యత, విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే అంశాలపై వీరిద్దరి మధ్య కీలక చర్చ జరిగింది. ఈ సందర్భంగా చాగంటి కోటేశ్వరరావు మాట్లాడుతూ.. విద్యార్థులను సమాజంలో బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దాలంటే నైతిక విలువలతో కూడిన విద్య అందించడం ఎంతో కీలకమని అభిప్రాయపడ్డారు. చిన్నతనం నుంచే పిల్లల్లో మానవతా విలువలు, క్రమశిక్షణ, నైతికత వంటి గుణాలను పెంపొందించాల్సిన అవసరాన్ని ఆయన మంత్రికి వివరించారు. కేవలం పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా, సంపూర్ణ వికాసం దిశగా విద్యార్థులను ప్రోత్సహించాలని సూచించారు.



పల్లె సాక్షి


# అదే అరాచకం.. అంతులేని పైశాచికం

**(మొదటిపేజి తరువాయి)** దగ్గరికైనా వచ్చి చెబుతాం' అని అందులో పేర్కొన్నారు.

**వేలం విధానం పరిశీలించకపోతే ఎలా?...** దేవరపల్లి పొగాకు వేలం కేంద్రంలో రైతులను కలిసేందుకు జగన్ వెళ్లినపుడు ఆ పార్టీ కార్యకర్తలు అక్కడా విధ్వంసం సృష్టించారు. జగన్ తమ కష్టాలు వింటారని రైతులు భావిస్తే.. ఆయనతోపాటు వచ్చినవారు పొగాకు బేళ్లను కాళ్లతో తొక్కేసి చిందరవందర చేయడంతో రైతులు తల్లడిల్లారు. బేళ్లను మళ్లీ కట్టుకోవాలని కృష్ణంపాలేనికి చెందిన రైతు బి.ప్రసాద్ పేర్కొన్నారు. పొగాకు రైతులకు బాసటగా నిలిచేందుకని వేలం కేంద్రానికి వచ్చిన జగన్.. కనీసం ఆ ప్రకియను పరిశీలించకుండానే వెళ్లడం పట్ల కొందరు రైతులు విస్తుపోయారు. తమ సమస్యలు తెలుసుకోకుండా బేళ్లను నాశనం చేయడం ఏమిటని కరుటూరి శ్రీనివాసరావు అనే రైతు ప్రశ్నించారు.

**హెలిప్యాడ్ వద్ద..** జగన్ పర్యటనలో ఆ పార్టీశ్రేణులు ఎక్కడా నిబంధనలు, ఆంక్షలు పట్టించుకోలేదు. హెలిప్యాడ్ వద్ద ఏర్పాటుచేసిన బారికేడ్లను ధ్వంసం చేసేశారు. పోలీసులను



తోసుకుంటూ వందల సంఖ్యలో హెలికాప్టర్ వద్దకు దూసుకుపోయారు. ద్విచక్ర వాహనాలు, ట్రాక్టర్లు, ఇతర వాహనాలతో కార్యకర్తలు దేవరపల్లి ప్రధాన రహదారులను ఆక్రమించారు. ద్విచక్రవాహనాలకు సైలెన్సర్లు తీసేసి అతివేగంగా, ప్రమాదకరంగా డ్రైవింగ్ చేస్తూ, స్టంట్లతో వీరంగం సృష్టించారు. అంబులెన్స్‌లకు సైతం మార్గం ఇవ్వలేదు. బస్సుల రాకపోకలకూ తీవ్ర అంతరాయం ఏర్పడింది. ప్రయాణికులంతా ఎండలో అవస్థలు పడ్డారు. రాజమహేంద్రవరం నుంచి ఏలూరు, జంగారెడ్డిగూడెం వెళ్లే బస్సులు సుమారు 3గంటలు నిలిచిపోయాయి. దేవరపల్లి బస్టాండ్‌లో ప్రయాణికులను సైతం ఖాళీ చేయించి ఆ పార్టీ నాయకులు ఆక్రమించారు. వేలం కేంద్రం లోపలికి వెళ్లేందుకు 200మంది రైతులనే అనుమతించాలంటూ పేర్ల జాబితాను వైకాపా నాయకులు తొలుత పోలీసులకు అందించారు. దాని ఆధారంగానే వారిని పంపించారు. తర్వాత పెద్దసంఖ్యలో కార్యకర్తలు జగన్ వాహనశ్రేణి లోపలికి వెళ్లినపుడు, తర్వాత ఒక్కసారిగా గేట్లు తోసుకుంటూ లోపలికి చొరబడ్డారు. వేలం కేంద్రం పైకప్పు ఎక్కి వేలాడుతూ, కిటికీల వద్ద, గ్రిల్‌ను నెడుతూ ఇంకొందరు బీభత్సం సృష్టించారు.

## తూర్పు పశ్చిమలను కలిపేద్దాం..!!

**(మొదటిపేజి తరువాయి)** జరగాలి. ప్రతి ప్రాంతంలోనూ మౌలిక సౌకర్యాలు కల్పించాలి. స్థానిక యువతలో నైపుణ్యాలు పెంపొందించాలి. తీరప్రాంత నిర్వహణ ప్రణాళికలకు అనుగుణంగా ప్రాజెక్టులు చేపట్టాలి. పరిశ్రమలు, టౌన్ షిప్ ఎకో సిస్టమ్, టూరిజం ప్రాజెక్టుల్ని అందుబాటులోకి తేవాలి. పీపీపీ ప్రాజెక్టులతోపాటు.. వాటికి వీజీఎఫ్ పథకం వర్తింపజేసే అంశాన్ని పరిశీలించాలి. సీఆర్‌జెడ్ నిబంధనలకు అనుగుణంగా వీఈఆర్ ప్రాజెక్టును పూర్తి చేద్దాం. వీఈఆర్ అభివృద్ధి ప్రణాళికల్లో విద్యా సంస్థలు, విశ్వవిద్యాలయాల్ని భాగస్వాములుగా చేయాలి. ఆంధ్ర విశ్వవిద్యాలయం సేవలను ఉపయోగించుకోవాలి.

**విశాఖలో ఎకో సిస్టమ్ ఏర్పాటైంది: అధికారులు**

విశాఖలో ఐటీ, డేటా సెంటర్లు సహా వివిధ రంగాలకు చెందిన ఎకో సిస్టం ఏర్పాటైంది. అందుకు అనుగుణంగా వీఈఆర్ అభివృద్ధి ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం. బే సిటీ ప్రాజెక్టును యాంకర్ ప్రాజెక్టుగా అభివృద్ధి చేసేలా ప్రణాళికలు రూపొందించాం. వీఈఆర్ పరిధిలో మొత్తంగా రూ.9.50 లక్షల కోట్ల వరకు పెట్టుబడులు వచ్చేందుకు అవకాశం ఉంది. కాకినాడ, విశాఖలతో పశ్చిమ భారతదేశంలోని వివిధ ప్రాంతాలు అనుసంధానం కావాలి. ముఖ్యంగా 4 విమానాశ్రయాలు, 3 పోర్టులను అనుసంధానిస్తే వేగవంతమైన అభివృద్ధితోపాటు పెట్టుబడులు ఎక్కువగా వచ్చే అవకాశం ఉంటుంది.

ప్రధాని మోదీ వీడియో తొలగింపుపై

## మెటా క్షమాపణ..

**(మొదటిపేజి తరువాయి)** హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. సోషల్ మీడియా సంస్థలు కేవలం మధ్యవర్తులు మాత్రమేనని చెప్పి బాధ్యత నుంచి తప్పించుకోలేవని, వినియోగదారులకు ఏ కంటెంట్‌ను చూపించాలనే విషయంలో అల్గోరిథమ్‌ల ద్వారా నిర్ణయాలు



తీసుకుంటున్నందున వాటికి పూర్తి బాధ్యత ఉంటుందని ప్రభుత్వం స్పష్టం చేసినట్లు సమాచారం. జూలై 23న ప్రధాని నరేంద్ర మో దీకి సంబంధించిన వీడియోను ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌ల నుంచి కొంతసేపు తొలగిం చారు. అనంతరం దానిని పునరుద్ధరించిన మెటా, ఇది సాంకేతిక లోపం కారణంగా జరిగిందని వివరణ ఇచ్చింది. అయితే ఆ వివరణతో ప్రభుత్వం పూర్తిగా సంతృప్తి చెందలేదని తెలుస్తోంది. ఇదే అంశంపై బీజేపీ ఎంపీ నిషికాంత్ దుబే నేతృత్వంలోని పార్లమెంటరీ సమాచార సాంకేతిక స్థాయీ సంఘం కూడా మెటా వివరణ కోరింది. ముఖ్యంగా మహిళలను కించపరిచే పోస్టులు, బాలల లైంగిక వేధింపులకు సంబంధించిన కంటెంట్‌ను వేగంగా తొలగించేలా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించింది. సుమారు 45 నిమిషాల పాటు సాగిన ఈ సమావేశంలో మెటా గ్లోబల్ అఫైర్స్ అధికారి జోయెల్ కాప్లాన్‌తో పాటు సంస్థకు చెందిన పలువురు సీనియర్ అధికారులు పాల్గొన్నారు. భారతదేశం మెటాకు అతిపెద్ద మార్కెట్లలో ఒకటిగా ఉండటంతో, దేశ చట్టాలు, నియంత్రణలను పూర్తిగా పాటించాల్సిన అవసరాన్ని ప్రభుత్వం మరోసారి స్పష్టం చేసినట్లు సమాచారం.

## ఢిల్లీ డేంజర్.. కుట్రల్లో చిక్కుకోవద్దు

**ఎన్‌డీఏ ఎంపీలకు ప్రధాని మోదీ జాగ్రత్తలు**

**న్యూఢిల్లీ :** దేశ రాజధాని గురించి ఎన్‌డీఏ రాజ్యసభ ఎంపీలకు ప్రధాని మోదీ జాగ్రత్తలు చెప్పారు. ఢిల్లీ ప్రమాదకర ప్రదేశమన్నారు. లూటియన్స్ జోన్‌లో అప్రమత్తంగా ఉండాలని..



కుతంత్రాల వలలో చిక్కుకోవద్దని సూచించారు. ఎవరిని కలుస్తున్నారో, ఎక్కడ కలుస్తున్నారో మెలకువతో వ్యవహరించాలన్నారు. బుధవారం ఉదయం 37 మంది ఎన్‌డీఏ రాజ్యసభ ఎంపీలతో ఆయన అల్పాహార విందు సమావేశం ఏర్పాటుచేశారు. గంటపాటు భేటీ సాగింది. ఎంపీ లెటర్‌హెడ్ దుర్వినియోగం కాకుండా చూసుకోవాలని ప్రధాని వారికి సూచించారు. ఈ సందర్భంగా ఢిల్లీ రాజకీయాలపై కొన్ని టిప్స్ ఇచ్చారు. ఎవరితోనైనా ఫోన్లో గౌరవంగా మాట్లాడాలని అన్నారు. ఈ ఎంపీల్లో బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్, ఆప్ నుంచి బీజేపీలోకి వచ్చిన ఎంపీలు కూడా ఉన్నారు. పార్లమెంటుకు తప్పనిసరిగా హాజరు కావాలని.. నూరు శాతం హాజరు ఉండేలా చూసుకోవాలని.. ప్రతి రోజూ పార్లమెంటు గ్రంథాలయంలో కనీసం ఒకట్రెండు గంటలు గడపాలని సూచించారు. యువతతో మమేకం కావాలని.. ఎంపీలాడ్స్ నిధులను నియోజకవర్గాల్లో యువజనులు, క్రీడా కార్యకలాపాలకు ఉపయోగించాలన్నారు.

## తమిళనాడులో జెన్‌జీకి ప్రత్యేక పథకాలు

**చెన్నై :** దేశంలోనే తొలి ఏఐ సిటీని, ఏఐ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తామని తమిళనాడు ప్రభుత్వం ప్రకటించింది. టీవీకే ప్రభుత్వం తొలి బడ్జెట్‌ను రాష్ట్ర ఆర్థికమంత్రి మరియా విల్సన్ బుధవారం ఉదయం అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. జెన్‌జీ కోసం పలు ప్రత్యేక పథకాలు



ప్రకటించారు. అంతర్జాతీయ నైపుణ్యాభివృద్ధి కేంద్రాన్ని, ప్రయోగశాలను, ఐఏ క్వాం టమ్ సాంకేతిక పరిజ్ఞానం తో కూడిన పరిశోధనా కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు గల సాధ్యాసాధ్యాలపై పరిశీల నకు రూ.5 కోట్లు కేటాయించారు. 11వ తరగతి విద్యార్థులకు ఉచిత సైకిళ్లతో పాటు హెల్మెట్లు, వాటర్ బాటిళ్లను కూడా అందిస్తామన్నారు. కళాశాలలో చదివే విద్యార్థులకు ల్యాప్‌ట్ల?పలు పంపిణీ చేస్తామన్నారు. రూ.90 కోట్ల వ్యయంతో 5 పారిశ్రామిక శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. వెట్రి నైపుణ్యాభివృద్ధి పథకం ద్వారా 12 లక్షల మంది కాలేజీ విద్యార్థులు, లక్షమంది నిరుద్యోగులకు ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంతో నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందిస్తామన్నారు. 2031లోగా ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ కాలేజీలలో చదివే 5 లక్షల మంది యువకులకు ఏఐపై శిక్షణ అందిస్తామన్నారు. విద్యుత్ వాహనాల మరమ్మతు పనుల కోసం వచ్చే ఐదేళ్లలో 12,500 మంది యువకులకు మెకానిక్ శిక్షణ ఇస్తామని చెప్పారు.

# 'తుమ్మిడిహెట్టి'కి మహారాష్ట్రను ఒప్పించండి

**(మొదటిపేజి తరువాయి)** రెండు రాష్ట్రాల మధ్య ఒప్పందం కుదిరిన విషయాన్ని సీఎం గుర్తు చేశారు. "బ్యారేజీ నిర్మాణాన్ని 152 మీటర్ల ఎత్తు వరకు పెంచితే తలెత్తే ప్రభావాలపై పుణెలోని సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ సెంటర్ అధ్యయనం చేసింది. దాని ప్రకారం 148, 152 మీటర్ల ఎత్తున నిర్మించినా ముంపులో పెద్దగా తేడా లేదని స్పష్టమైంది. ముంపునకు గురయ్యే భూభాగంలో 50 శాతం నదీ గర్భం (రివర్ బెడ్)లోనే ఉంటుంది. 148 మీటర్ల ఎత్తున బ్యారేజీ నిర్మాణం చేపడితే గ్రావిటీ ద్వారా కావాల్సినంత నీరు సరఫరా చేయలేం. అందువల్ల 150 నుంచి 152 మీటర్ల ఎత్తున నిర్మాణానికి మహారాష్ట్రను ఒప్పించాలి. దీనిపై సాధ్యమైనంత త్వరగా తెలంగాణ, మహారాష్ట్రల మధ్య సమావేశం ఏర్పాటు చేయించండి. ఈ ప్రాజెక్టు పూర్తయితే పూర్తిగా వెనుకబడిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు సాగునీటి వసతి ఏర్పడుతుంది" అని సీఎం వివరించారు. ఇందుకు సీఆర్ పాటిల్ స్పందిస్తూ.. దీనిపై మొదట కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసి తెలంగాణ, మహారాష్ట్ర స్థాయి అధికారులతో చర్చల ప్రక్రియ



ప్రారంభిస్తామని తెలిపారు. తర్వాత ఇరురాష్ట్రాల నీటి పారుదల శాఖ మంత్రుల సమావేశం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

**పాలమూరు, గౌరవెల్లి, సీతమ్మ సాగర్, డిండిలపై..** పాలమూరు-రంగారెడ్డి, గౌరవెల్లి, సీతమ్మ సాగర్, డిండి ప్రాజెక్టులకు సత్వరమే పర్యావరణ అనుమతులు మంజూరు చేయాలని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం పాలమూరు ప్రాజెక్టుపై రూ.36,437 కోట్లు, డిండిపై రూ.3,187 కోట్లు, సీతమ్మ సాగర్‌పై రూ.1,835 కోట్లు, గౌరవెల్లి ప్రాజెక్టుపై రూ.1,350 కోట్లు ఖర్చు చేసిందని కేంద్ర మంత్రికి తెలిపారు. కేంద్రం అనుమతులు ఇవ్వకపోవడంతో పనులు నిలిచిపోయి.. అంచనా వ్యయం పెరుగుతోందని సీఎం చెప్పారు. ఈ సమావేశాల్లో కేంద్ర అటవీ, పర్యావరణశాఖ సహాయమంత్రి కీర్తివర్ధన్‌సింగ్, ఎంపీలు మల్లు రవి, వేం నరేందర్ రెడ్డి, రామసహాయం రఘురాంరెడ్డి, బలరాం నాయక్, గడ్డం వంశీకృష్ణ, అనిల్ యాదవ్, కడియం కావ్య తదితరులు పాల్గొన్నారు.

## సంపాదకీయం

## ఇది సార్ మన రేంజ్..!

**ఈజిప్ట్ మనసు దోచుకున్న మన 'పినాకా'..**

**భారత రక్షణ రంగ తయారీ ఉత్పత్తులకు అంతర్జాతీయ స్థాయిలో రోజురోజుకూ డిమాండ్ పెరుగుతోంది. తాజాగా, ఆఫ్రికా-మధ్యప్రాచ్య దేశాల్లో కీలక శక్తిగా ఉన్న ఈజిప్ట్.. తన సుదూర ఆర్టిలరీ సామర్థ్యాన్ని ఆధునీకరించుకునేందుకు భారత్‌కు చెందిన 'పినాకా' రాకెట్ సిస్టమ్‌ను పరిశీలిస్తోంది. అమెరికాకు చెందిన అత్యంత శక్తివంతమైన 'హిమార్స్' (HIMARS) రాకెట్ వ్యవస్థకు ప్రత్యామ్నాయంగా..**

భారత రక్షణ రంగ తయారీ ఉత్పత్తులకు అంతర్జాతీయ స్థాయిలో రోజురోజుకూ



డిమాండ్ పెరుగుతోంది. తాజాగా, ఆఫ్రికా-మధ్యప్రాచ్య దేశాల్లో కీలక శక్తిగా ఉన్న ఈజిప్ట్.. తన సుదూర ఆర్టిలరీ సామర్థ్యాన్ని ఆధునీకరించుకునేందుకు భారత్‌కు చెందిన 'పినాకా' రాకెట్ సిస్టమ్‌ను పరిశీలిస్తోంది. అమెరికాకు చెందిన అత్యంత శక్తివంతమైన 'హిమార్స్' (HIMARS) రాకెట్ వ్యవస్థకు ప్రత్యామ్నాయంగా భారత్ తయారు చేసిన స్వదేశీ 'పినాకా' (Pinaka) మల్టీ బెరల్ రాకెట్ లాంచర్‌పై ఇప్పుడు ఈజిప్ట్ కన్నేసింది. తక్కువ ఖర్చుతో అత్యంత కచ్చితమైన దాడులు చేయగల సత్తా ఉండటంతో ఈజిప్ట్ సైన్యం దీనిపై తీవ్ర ఆసక్తి చూపు




తోంది. పినాకా ప్రత్యేకతలు ఏమంటే. ఖచ్చితమైన దాడి (ాతీవఎఱంఱశీఅ శాతీఱఅవ): కేవలం గుడ్డిగా రాకెట్లను కురిపించకుండా, శత్రువుల కమాండ్ సెంటర్లు, రాడార్లు, లాజిస్టిక్స్ హబ్స్‌ను కచ్చితంగా ధ్వంసం చేసేలా దీనిని తీర్చిదిద్దారు. ఇందులో INS, GPS తో పాటు భారత్ స్వదేశీ NavIC శాటిలైట్ నావిగేషన్ సిస్టమ్‌ను జోడించారు. రేంజ్ పెరుగుతుంది. ఎన్హాన్స్డ్ రేంజ్ పినాకా: 45-60 కి.మీ, గైడెడ్ పినాకా: 75-80 కి.మీ, లాంగ్ రేంజ్ గైడెడ్ రాకెట్ (LRGR): ఏకంగా 120 కి.మీ దూరంలోని లక్ష్యాలను కూడా ఛేదించగలదు. ఒకే లాంచర్ - రకరకాల రాకెట్లు.. ఈ మాడ్యులర్ డిజైన్ వల్ల ఒకే లాంచర్ నుంచి వేర్వేరు శ్రేణులకు చెందిన రాకెట్లను ప్రయోగించవచ్చు. దీనివల్ల నిర్వహణ ఖర్చు (ఌఱఅఠవఅఎఅవ ఎశీర్), సిబ్బంది శిక్షణ భారం చాలా వరకు తగ్గుతుంది. గతంలో అమెరికా, యూరప్, రష్యా దేశాలపైనే పూర్తిగా ఆధారపడిన ఈజిప్ట్.. మారుతున్న భౌగోళిక రాజకీయ పరిస్థితులు, ఆంక్షలు, సప్లై చైన్ రిస్కుల కారణంగా తన రక్షణ భాగస్వాములను మార్చుకుంటోంది. ఇందులో భాగంగానే స్వతంత్ర విదేశాంగ విధానం కలిగిన భారత్‌తో రక్షణ బంధాన్ని బలపరుచుకోవాలని భావిస్తోంది. ఈజిప్ట్ కేవలం పినాకాపైనే కాకుండా, భారత్‌కు చెందిన 'ఆకాశ్' ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్, ప్రపంచ ప్రఖ్యాత 'బ్రహ్మోస్' సూపర్ సోనిక్ క్రూయిజ్ క్షిపణులపై కూడా ఆసక్తి కనబరుస్తోంది. ఈ ఒప్పందాలు కార్యరూపం దాలిస్తే.. భారత్-ఈజిప్ట్ మధ్య రక్షణ రంగంలో సరికొత్త శకం ప్రారంభం కానుంది. ఈజిప్ట్ లాంటి దేశాలు భారతీయ ఆయుధాలను కొనుగోలు చేయడం ద్వారా.. గ్లోబల్ డిఫెన్స్ మార్కెట్‌లో 'మేక్ ఇన్ ఇండియా' ఆయుధాల విశ్వసనీయత మరింత పెరుగుతుంది. పినాకాతో భారత రక్షణ ఎగుమతులు మరో స్థాయికి వెళ్లడం ఖాయంగా కనిపిస్తోంది.

## ఆంధ్రప్రదేశ్‌కు విదేశీ... పెట్టుబడుల ప్రవాహం

**ఆంధ్రప్రదేశ్‌కు విదేశీ పెట్టుబడుల ప్రవాహం కొనసాగుతోంది. లోక్‌సభలో లెక్కలతో సహా కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. లోక్‌సభలో వైసీపీ ఎంపీ అడిగిన ప్రశ్నపై కేంద్రం వివరించింది.**

**అమరావతి :** ఆంధ్రప్రదేశ్‌కు విదేశీ పెట్టుబడుల ప్రవాహం కొనసాగుతోంది. లోక్‌సభలో లెక్కలతో సహా కేంద్రప్రభుత్వం స్పష్టం చేసింది. లోక్‌సభలో వైసీపీ ఎంపీ అడిగిన ప్రశ్నపై కేంద్రం వివరించింది. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హయాంలో కంటే




కూటమి ప్రభుత్వ పాలనలో భారీగా విదేశీ పెట్టుబడులు పెరిగాయని కేంద్రం తేల్చిచెప్పింది. 2023 - 24 ఆర్థిక సంవత్సరంలో రూ.760 కోట్లుగా (92.13 మిలియన్ డాలర్లు) ఎఫ్‌డీఐలు ఉన్నాయని వెల్లడించింది. 2024-25 నాటికి 233.14 మిలియన్ డాలర్లకు విదేశీ ఈక్విటీ పెట్టుబడులు పెరిగాయని పేర్కొంది. 2025 - 26 నాటికి ఏకంగా రూ.5,000 కోట్లకు పైగా (608.59 మిలియన్ డాలర్లు) ఎఫ్‌డీఐలు ఎగబాకినట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. వైసీపీ హయాంలో పారిశ్రామిక విధానాల్లో అనిశ్చితి వల్ల పెట్టుబడుల ప్రవాహం వెనకబడిందని చెప్పింది. 2025 - 26లో లోహ పరిశ్రమల రంగంలో అత్యధికంగా 250.67 మిలియన్ డాలర్ల ఎఫ్‌డీఐలు వచ్చినట్లు స్పష్టం చేసింది. ఆహార శుద్ధి రంగంలో 107.30 మిలియన్ డాలర్లు, సిమెంట్ ఉత్పత్తుల రంగంలో 99.90 మిలియన్ డాలర్ల విదేశీ పెట్టుబడులు వచ్చాయని పేర్కొంది. సర్వీసెస్, ఆర్‌అండ్‌డీ పరిధిలోనూ 2025-26లో 59.96 మిలియన్ డాలర్ల పెట్టుబడులు నమోదైనట్లు వెల్లడించింది. కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన అనుకూల పారిశ్రామిక విధానాలు, 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'తో పెట్టుబడులు ఊపందుకున్నాయని కేంద్ర ప్రభుత్వం చెప్పింది. వైసీపీ పాలన కంటే కూటమి హయాంలో ఎఫ్‌డీఐల రీసౌండింగ్ గ్రోత్... 92 మిలియన్ డాలర్ల నుంచి ఏకంగా 608 మిలియన్ డాలర్లకు విదేశీ పెట్టుబడులు చేరాయని వివరించింది. సీఎం చంద్రబాబు బ్రాండ్ ఇమేజ్, వేగవంతమైన అనుమతులతో ఏపీ వైపు విదేశీ దిగ్గజ సంస్థలు క్యూ కడుతున్నాయని పేర్కొంది. లోహ, ఆహార శుద్ధి, సిమెంట్ రంగాల్లో భారీ పెట్టుబడులు వచ్చాయని కేంద్రం ప్రభుత్వం స్పష్టం చేసింది.

## ఇండియన్ రెడ్ క్రాస్ జిల్లా శాఖకు ఏకగ్రీవంగా
# నూతన కార్యవర్గం

**అనంతపురం** : ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అనంతపురం జిల్లా శాఖకు నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. బుధవారం నూతన కార్యవర్గ సభ్యులు జిల్లా కలెక్టర్, జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు ఓ. ఆనంద్, ఐఏఎస్‌ను వారి ఛాంబర్‌లో మర్యాదపూ ర్వకంగా కలిశారు. జిల్లా శాఖ పాలకసమితి పదవీకాలం ముగియనున్న నేపథ్యంలో ఏప్రిల్ 29న కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో ఎన్నికల అధికారి జి. రామకృష్ణారెడ్డి అధ్యక్షతన వార్షిక సర్వసభ్య సమావేశం, కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. నాలుగు ప్యానెల్‌ల నుంచి 44 మంది నామినేషన్లు దాఖలు చేయగా, రెడ్ క్రాస్ సేవా స్ఫూర్తికి అనుగుణంగా వివాదాలకు తావులేకుండా ఏకాభిప్రాయంతో 11 మంది సభ్యులతో నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. ఈ ప్రక్రియను జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ అధికారికంగా ధృవీకరించారు. నూతన కార్యవర్గంలో డా. గజ్జల లక్ష్మణ ప్రసాద్ చైర్మన్‌గా, ప్రొఫెసర్ డా. గీతా బాల వైస్ చైర్మన్‌గా, సుంకర రమేష్ ట్రెజరర్‌గా ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా డా. కె. లక్ష్మీనారాయణ, ఎం.జి. ఎరన్న, డా. ఓ. మనోరంజన్ రెడ్డి, ఆలంబన జనార్ధన్, భిసతి భరత్, దాసరి భరత్ కుమార్, వి.కె. శ్రీవాణి, విష్ణుప్రియ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నూతన కార్యవర్గాన్ని అభినందిస్తూ, వైద్య, విద్య, వ్యాపార, సామాజిక సేవ తదితర రంగాలకు చెందిన అనుభవజ్ఞులు సమిష్టిగా పనిచేస్తూ రెడ్ క్రాస్ సేవలను మరింత విస్తృతంగా ప్రజలకు చేరవేయాలని సూచించారు. అలాగే ఈ నెల 30న నిర్వహించనున్న "చేయూత" ఉచిత కృత్రిమ చేతుల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. త్వరలోనే జిల్లా రెడ్ క్రాస్ కార్యాలయాన్ని సందర్శిస్తానని తెలిపారు. నూతన కార్యవర్గ సభ్యులు జిల్లా పరిపాలన అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు తెలుపుతూ, రక్తదానం, ప్రథమ చికిత్స శిక్షణ, విపత్తు నిర్వహణ, ఆరోగ్య సేవలు, యువజన సేవా కార్యక్రమాలు, దివ్యాంగుల సంక్షేమం వంటి మానవతా సేవలను మరింత విస్తృతంగా ప్రజలకు చేరవేసేందుకు సమిష్టిగా కృషి చేస్తామని పేర్కొన్నారు.





## పరిశ్రమల స్థాపనతో...
# జిల్లా అభివృద్ధికి వేగం

**: కలెక్టర్ ఓ. ఆనంద్**

**అనంతపురం** : పరిశ్రమల స్థాపన ద్వారానే జిల్లా సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ పేర్కొన్నారు. పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహిస్తూ కొత్త పరిశ్రమల ఏర్పాటుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. బుధవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన 70వ జిల్లా ఇండస్ట్రీస్ అండ్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ఇప్పటివరకు 68 దరఖాస్తులు అందగా, వాటిలో 48 దరఖాస్తులకు ఆమోదం లభించిందని, రెండు దరఖాస్తులు తిరస్కరించగా, మిగిలిన 18 దరఖాస్తులను త్వరలోనే పరిష్కరిస్తామని పరిశ్రమల శాఖ అధికారులు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 20 పరిశ్రమలకు రూ.1.88 కోట్లకు పైగా పెట్టుబడి రాయితీ, రెండు యూనిట్లకు విద్యుత్ శక్తి రాయితీగా రూ.47,531 మంజూరు చేసినట్లు తెలిపారు. జిల్లాలో నిర్మాణ దశలో ఉన్న సిల్వర్ స్పార్క్, సుగుణ స్పాంజ్ ప్రైవేట్ లిమిటెడ్, సరళ ఏవియేషన్ ప్రైవేట్ లిమిటెడ్ వంటి భారీ పరిశ్రమల పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. కొత్త పరిశ్రమలకు కేటాయించిన భూముల్లో నిర్మాణ పనులను త్వరగా ప్రారంభించాలని, గార్లదిన్నె మండలం కణంపల్లెలో ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ప్రతిపాదనకు సంబంధించిన డీటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్‌ను త్వరగా సమర్పించాలని ఉద్యానవన శాఖ అధికారులకు సూచించారు. అలాగే విశ్వకర్మ పథకానికి అర్హులైన లబ్ధిదారులకు శిక్షణ ఇచ్చి, అవసరమైన రుణాలను బ్యాంకులు సకాలంలో మంజూరు చేయాలని లీడ్ బ్యాంక్ అధికారులను ఆదేశించారు. ప్రతి నెలా ఇండస్ట్రీస్ అండ్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కమిటీ సమావేశాలను నిర్వహిస్తూ మరిన్ని పరిశ్రమలను జిల్లాకు తీసుకురావాలని, తద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించి జిల్లా అభివృద్ధికి తోడ్పడాలని కలెక్టర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్, లీడ్ బ్యాంక్ మేనేజర్, ఉద్యానవన శాఖ అధికారులు, డీఆర్‌డీఏ పీడీ శైలజ తదితరులు పాల్గొన్నారు.



## లింగ నిర్ధారణ, లింగ ఎంపికకు పాల్పడితే
# కఠిన చర్యలు

**: డీఎంహెచ్‌వో డా. ఫైరోజా బేగం**

**పుట్టపర్తి** : గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ, లింగ ఎంపిక వంటి చట్టవిరుద్ధ చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవని శ్రీ సత్యసాయి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎం హెచ్‌వో) డా. ఫైరోజా బేగం హెచ్చరించారు. బుధ వారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాల యంలో జిల్లా ఎంసీటీపీ (మెడికల్ టెర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ) కమిటీ, జిల్లా స్థాయి పీసీపీఎన్‌డీటీ సలహా కమిటీ సమావేశాలను నిర్వహించారు. మెడికల్ టెర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ (ఎంసీటీపీ) చట్టం మేరకు జిల్లాలో సేవలు అందించేందుకు దరఖాస్తు చేసుకున్న 17 ప్రైవేట్ ఆసుపత్రుల దరఖాస్తులను కమిటీ పరిశీలించింది. గైనకాలజిస్టు, పీడియాట్రిషన్, ఫిజీషియన్, కదిరి ఏరియా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డా. హుస్సేన్ తదితర సభ్యులు ఆసుపత్రుల్లో ఉన్న సౌకర్యాలు, అర్హతలను పరిశీలించి నిబంధనలకు అనుగుణంగా ఉన్న 17 ప్రైవేట్ ఆసుపత్రులకు ఎంసీటీపీ సేవలు నిర్వహించేందుకు ఆమోదం తెలిపారు. అనంతరం నిర్వహించిన జిల్లా స్థాయి సలహా కమిటీ సమావేశంలో పీసీపీఎన్‌డీటీ చట్టం--1994 నిబంధనలను జిల్లాలో కట్టుదిట్టంగా అమలు చేయాలని డీఎంహెచ్‌వో ఆదేశించారు. గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ, లింగ ఎంపిక వంటి చట్టవిరుద్ధ చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని, చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సంబంధిత అధికారులు సమన్వయంతో తనిఖీలు నిర్వహించడంతో పాటు ప్రజల్లో చట్టంపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో ఎస్‌వో కళాధర్, డిప్యూటీ డీఎంఈఓ సుబ్రహ్మణ్యం, డిప్యూటీ హెచ్‌ఈఓ రామలక్ష్మి, డీపీహెచ్‌ఎన్‌వో వీరమ్మ తదితరులు పాల్గొన్నారు.



## జవహర్ నవోదయ విద్యాలయాలే...
# గ్రామీణ ప్రతిభకు వేదిక : కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్















**లేపాక్షి** : శ్రీ సత్యసాయి జిల్లా లేపాక్షిలోని జవహర్ నవోదయ విద్యాలయంలో బుధవారం నిర్వహించిన 'నవోదయ ఫౌండేషన్ డే' వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఉదయం ప్రారంభమైన ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఎ . శ్యామ్ ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరుకాగా, విద్యాలయ ప్రిన్సిపాల్ నాగరాజు అధ్యక్షత వహించారు. ప్రారంభంలో ప్రిన్సిపాల్ నాగరాజు మాట్లాడుతూ నవోదయ విద్యాలయాల ఆవిర్భావం, ఫౌండేషన్ డే ప్రాముఖ్యతను వివరించారు. గ్రామీణ ప్రాంతాల ప్రతిభావంతులైన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో నవోదయ విద్యాలయాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎ . శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ, లేపాక్షి జవహర్ నవోదయ విద్యాలయ విద్యార్థులు పదో తరగతి, ఇంటర్మీడియట్ ఫలితాల్లో సాధించిన ప్రతిభను అభినందించారు. జిల్లా వ్యాప్తంగా పదో తరగతి ఉత్తీర్ణత శాతం 80 శాతం ఉండగా, జేఎన్‌వీ లేపాక్షి 100 శాతం ఉత్తీర్ణత సాధించడం అభినందనీయమన్నారు. జూడో క్రీడలో 24 మంది విద్యార్థులు జాతీయ స్థాయికి ఎంపిక కావడం గర్వకారణమని కొనియాడారు. విద్య అంటే కేవలం పుస్తకాల సమాచారాన్ని కంఠస్థం చేయడం కాదని, ఆలోచించడం, విశ్లేషించడం, కొత్త ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టడమే నిజమైన విద్య అని పేర్కొన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజానికి సేవలందిస్తున్న ప్రతి ఒక్కరి పట్ల కృతజ్ఞతతో ఉండాలని, ఉన్నత స్థానాలకు చేరిన తర్వాత సమాజానికి సేవ చేయడం ప్రతి విద్యార్థి బాధ్యతగా భావించాలని సూచించారు. జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొని కష్టపడి విజయాన్ని సాధించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. అనంతరం విద్యా సంవత్సరంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పదో, పన్నెండో తరగతి విద్యార్థులకు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ప్రతిభా పురస్కారాలు అందజేశారు. పదో తరగతిలో కె. లాస్యరెడ్డి (98 శాతం) ప్రథమ స్థానం, కె. కిరణ్ తేజ (94.6 శాతం) ద్వితీయ స్థానం, ఎస్. అభిరామ్, వై. స్నేహలత (94.4 శాతం) తృతీయ స్థానం సాధించారు. పన్నెండో తరగతిలో ఎస్. చిత్రలేఖ (87.4 శాతం) ప్రథమ స్థానం, పి. హేమలత (86.2 శాతం) ద్వితీయ స్థానం, ఎన్. కార్తీక్ సాయి (85.6 శాతం) తృతీయ స్థానం సాధించారు. ఫౌండేషన్ డే వేడుకల్లో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. జేఎన్‌వీ మదనపల్లె విద్యార్థులు ప్రదర్శించిన ఇంట్యూషన్ ప్రోగ్రామ్‌తో పాటు, జేఎన్‌వీ లేపాక్షి విద్యార్థుల రిథమిక్ యోగా డాన్స్, క్లాసికల్ నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు వేమనారాయణ, డాక్టర్ వెంకట రమణ, రాజారెడ్డి, రమణారెడ్డి, లేపాక్షి తహసీల్దార్ సౌజన్యలక్ష్మి, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కేంద్ర రైల్వే మంత్రిని కలిసిన ఎంపీ అంబికా..

**అనంతపురం రైల్వే సమస్యల పరిష్కారానికి సమగ్ర వినతి**



**న్యూఢిల్లీ** : అనంతపురం పార్లమెంట్ నియోజకవర్గంలో రైల్వే సమస్యల పరిష్కారం, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాల కల్పన, రైల్వే మౌలిక వసతుల అభివృద్ధి కోసం అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను బుధవారం న్యూఢిల్లీలోని ఆయన కార్యాలయంలో కలిసి సమగ్ర వినతిపత్రాన్ని సమర్పించారు. కొత్త రైళ్ల మంజూరు, పలు రైళ్ల నిలుపుదల, రైల్వే స్టేషన్ల అభివృద్ధి, అండర్‌పాస్‌లు, ఫ్లైఓవర్ల నిర్మాణం, రైళ్ల సమయాల సవరణ తదితర అంశాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా గుంతకల్లు--బళ్లారి మధ్య మూడు, నాలుగు లైన్ల ట్రాక్ నిర్మాణానికి రూ.3,500 కోట్ల నిధులు మంజూరు చేసినందుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్, సహాయ మంత్రి సోమణ్ణకు ఎంపీ కృతజ్ఞతలు తెలిపారు. గత పదేళ్లుగా వారానికి మూడు రోజులే నడుస్తున్న కొండవీడు ఎక్స్‌ప్రెస్ (17211/17212)ను ప్రతిరోజూ నడపాలని, మచిలీపట్నం--యశ్వంత్‌పూర్ మార్గంలో ప్రయాణించే ఉద్యోగులు, విద్యార్థులు, వ్యాపారవేత్తలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రోజువారీ సర్వీసుగా మార్చాలని కోరారు. అలాగే గుంతకల్లు--బెంగళూరు ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌ను ఉదయం వేళల్లో ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. విజయవాడ--బెంగళూరు వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌తో పాటు విశాఖపట్నం--బెంగళూరు వందే భారత్ స్లీపర్ రైలును అనంతపురం మీదుగా ప్రతిరోజూ నడపాలని టీడీపీ ఎంపీలతో కలిసి కేంద్ర మంత్రిని కోరినట్లు తెలిపారు. దీనిపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించి, అక్టోబర్ నుంచి విశాఖపట్నం--బెంగళూరు వందే భారత్ స్లీపర్ రైలును ప్రారంభించే అంశాన్ని పరిశీలిస్తామని వెల్లడించినట్లు ఎంపీ తెలిపారు. ప్రస్తుతం ఉన్న రైళ్లలో అధిక రద్దీ కారణంగా ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కొత్త రైలు సర్వీసులు ప్రారంభమైతే ఆంధ్రప్రదేశ్--కర్ణాటక రాష్ట్రాల మధ్య ఆర్థిక, పారిశ్రామిక, విద్యా, వాణిజ్య సంబంధాలు మరింత బలోపేతం అవుతాయని ఎంపీ వివరించారు. ఎంపీ సమర్పించిన వినతిపత్రాన్ని సానుకూలంగా స్వీకరించిన కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్, అనంతపురం పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించిన ప్రతిపాదనలను రైల్వే బోర్డు అధికారులతో సమీక్షించి సాధ్యమైన మేరకు సానుకూల నిర్ణయాలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతపురం జిల్లాకు ఆధునిక రైల్వే సౌకర్యాలు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేస్తూ ప్రజల ఆకాంక్షల సాధనకు నిరంతరం కృషి చేస్తానని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ తెలిపారు.

# 2027 జనాభా గణనకు సన్నద్ధం కావాలి..

**డీసీహెచ్‌బీ పనులు గడువులోగా పూర్తి చేయాలి**

**- జిల్లా రెవెన్యూ అధికారి, జిల్లా సెన్సస్ అధికారి మాలోల**



**అనంతపురం** : 2027 జనాభా గణనలో భాగంగా జిల్లా సెన్సస్ హ్యాండ్‌బుక్ (ఙజఝదీ) తయారీకి సంబంధించిన అన్ని ఏర్పాట్లను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి, జిల్లా సెన్సస్ అధికారి మాలోల అధికారులను ఆదేశించారు. బుధవారం అనంతపురంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల (స్వయంప్రతిపత్తి) కామర్స్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా పరిధిలోని టెక్నికల్ అసిస్టెంట్లు (అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్లు, డిజిటల్ అసిస్టెంట్లు) కోసం జిల్లా సెన్సస్ హ్యాండ్‌బుక్ తయారీపై నిర్వహించిన ఒకరోజు శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లాలోని ప్రతి రెవెన్యూ గ్రామం, పట్టణానికి ఫీల్డ్ ఫంక్షనరీలను నియమించడం, యూజర్ ఐడీలు సృష్టించడం, గ్రామాలు--పట్టణాల మ్యాపింగ్ పూర్తి చేయడం, శిక్షకుల ఎంపిక, శిక్షణా కేంద్రాల ఏర్పాటు, డీసీహెచ్‌బీ మొబైల్ యాప్‌పై సమగ్ర శిక్షణ వంటి అన్ని ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. శిక్షణా కేంద్రాల్లో అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. టెక్నికల్ అసిస్టెంట్లు డీసీహెచ్‌బీ మొబైల్ యాప్‌పై పూర్తి అవగాహనతో శిక్షణ పొందిన అనంతరం, మండల స్థాయిలో పంచాయతీ కార్యదర్శులు, గ్రామ రెవెన్యూ అధికారులకు సమర్థవంతంగా శిక్షణ అందించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాలోల సూచించారు. నిష్ణాతులైన మాస్టర్ ట్రైనర్లు సూర్యనారాయణ రెడ్డి, వీరనారాయణ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 7వ తేదీ నుంచి నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం మండల స్థాయిలో ఫీల్డ్ ఫంక్షనరీలకు శిక్షణ నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 15 వరకు పంచాయతీ కార్యదర్శులు, గ్రామ రెవెన్యూ అధికారులు తమ పరిధిలో జిల్లా సెన్సస్ హ్యాండ్‌బుక్‌కు అవసరమైన క్షేత్రస్థాయి సమాచార సేకరణ చేపట్టనున్నట్లు వెల్లడించారు. అన్ని ఛార్జ్ సెన్సస్ అధికారులు, అదనపు ఛార్జ్ సెన్సస్ అధికారులు ఈ కార్యక్రమానికి అత్యున్నత ప్రాధాన్యత ఇచ్చి, నిర్ణీత గడువులోగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి జిల్లా సెన్సస్ హ్యాండ్‌బుక్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అనంతపురం తహసీల్దార్ రాజా, సెన్సస్ విభాగం డిప్యూటీ తహసీల్దార్ మధుసూదన్ రావు తదితరులు పాల్గొన్నారు.

## సిరివరంలో భూ పునఃసర్వే, పంట నమోదు,
# గ్రామ సచివాలయ పనితీరును పరిశీలించిన జిల్లా కలెక్టర్







**లేపాక్షి** : శ్రీ సత్యసాయి జిల్లా లేపాక్షి మండలం సిరివరం రెవెన్యూ గ్రామంలో జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ బుధవారం పర్యటించి భూ పునఃసర్వే, పంటల నమోదు ప్రక్రియ, గ్రామ సచివాలయ పనితీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సిరివరం రెవెన్యూ గ్రామంలోని సర్వే నంబర్ 222లో 11.29 ఎకరాల పట్టా భూమిలో జరుగుతున్న భూ పునఃసర్వే ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. భూ వివరాల ధ్రువీకరణ, రైతుల గుర్తింపు నిర్ధారణ పనులను తనిఖీ చేసి, పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయాలని సర్వే సిబ్బందికి ఆదేశించారు. రైతులకు భూ పునఃసర్వే వల్ల కలిగే ప్రయోజనాలు, గుర్తింపు నిర్ధారణ ప్రక్రియ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలని సూచించారు. అదే సర్వే నంబర్‌లో రైతు వినోద్ సాగు చేసిన మొక్కజొన్న పంటను పరిశీలించిన కలెక్టర్, పంటల నమోదు ప్రక్రియను తనిఖీ చేశారు. ప్రతి రైతు సాగు చేసిన పంటను తప్పనిసరిగా నమోదు చేయాలని, తద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు, మద్దతు ధర వంటి ప్రయోజనాలు సకాలంలో అందుతాయని తెలిపారు. అనంతరం సిరివరం స్వర్ణ గ్రామ సచివాలయాన్ని సందర్శించిన కలెక్టర్ సిబ్బంది హాజరు నమోదు పుస్తకాలు, రికార్డులను పరిశీలించి పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. సచివాలయం పరిధిలో అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని తెలుసుకుని, ప్రజలకు సేవలందించడంలో నిర్లక్ష్యం వహించవద్దని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు సకాలంలో అందేలా బాధ్యతాయుతంగా పనిచేయాలని సిబ్బందికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో లేపాక్షి తహశీల్దార్ సౌజన్యలక్ష్మి, రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### స్వర్ణ కుప్పం విజన్ సాకారానికి వేగవంతంగా

# అభివృద్ధి పనులు

**ఐదేళ్ల అభివృద్దే కాక ఇరవై ఐదేళ్లలో కుప్పం మెగా సిటీ గా మారిపోవాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం ....కడ పి డి వికాస్ మర్మట్ ఐ ఏ ఎస్**

**కుప్పం, పల్లె సాక్షి ప్రతినిధి, ఆగస్ట్ 5,** కుప్పం ను స్వర్ణ కుప్పం గా మార్చాలన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి విజన్ సాకారం అయ్యేలా కుప్పం



నియోజక వర్గం ను ఐదేళ్ల అభివృద్దే కాక ఇరవై ఐదేళ్లలో ఒక మెగా సిటీ గా రూపాంతరం జరిగేలా కడ ద్వారా అన్ని ప్రణాళికలు సిద్ధంగా ఉండటమే కాకుండా అభివృద్ధి పనులు వేగవంతంగా జరిగేలా అన్ని చర్యలను తీసుకుంటున్నామని కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మట్ ఐ ఏ యస్ అన్నారు. బుధవారం కుప్పం పట్టణం లో గల కడ కార్యాలయం లో ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కుప్పం నియోజకవర్గంలో 32 పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నామని వాటి ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎనభై వేల మందికి ఉద్యోగ అవకాశాలు వస్తాయని తెలిపారు. తొమ్మిది వందల కోట్లతో మూడు సబ్స్టేషన్ లను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కుప్పం బెంగళూరు శాటిలైట్ రింగ్ రోడ్డు మంజూరైందన్నారు. రాబోవు రెండేళ్లలో కుప్పం లో ఏర్పాటు చేస్తున్న పరిశ్రమల్లో బయట వారు కుప్పం కు వచ్చి ఉద్యోగాలు చేసే అవకాశం వస్తుందన్నారు. పేదలకు గృహ నిర్మాణాల కోసం ఇంటి స్థలాలను మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. హంద్రీ నీవా పనులు పూర్తి అయిందని ఐదువందల యాభై ట్యాంకుల సంబంధించి 127 ట్యాంకులకు నీరు సరఫరా జరుగుతున్నదని అన్నారు. నవంబర్ లో మాస్టర్ ప్లాన్ విడుదల చేస్తామని చెప్పారు.కుప్పం పట్టణం ను ఐదుకోట్ల తో సుందరీకరణ పనులు చేస్తాం అన్నారు. కుప్పం లో నూతనంగా ప్రపంచ స్థాయి రైతుబజార్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆర్టీసీ బస్టాండ్ ను అన్ని హంగులతో నిర్మిస్తున్నట్లు చెప్పారు. రామకుప్పం ననియాల లో రీసార్ట్ నిర్మాణం, కుప్పం లో అండర్ డ్రైనేజీ పనులు తదితర అన్ని అభివృద్ధి పనులను వేగంతంగా చేసి కుప్పం అభివృద్ధిని స్వర్ణ కుప్పం తో పాటు మెగా సిటీ గా అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి ఆదేశాలతో ప్రజలందరి సహకారం తో అన్ని విధాలా కృషి చేస్తున్నట్లు కడ పి డి వికాస్ మర్మట్ ఐ ఏ యస్ విలేకరుల సమావేశం లో అన్నారు.

# కుప్పం రెస్కో బోర్డు సమావేశం

**కుప్పం, పల్లె సాక్షి ప్రతినిధి, ఆగస్టు 5,** కుప్పం లోని రెస్కో కార్యాలయంలో బుధవారం రెస్కో చైర్మన్ ప్రతాప్ అధ్యక్షతన రెస్కో పాలకమండలి సభ్యుల సమావేశాన్ని



నిర్వహించారు. కుప్పం రెస్కో ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, పిల్ల పైన సోలార్ ఏర్పాటు తదితర అంశాలకు సంబంధించి పాలకమండ లి సభ్యులతో సమావేశం నిర్వహించి చైర్మన్ ప్రతాప్,వైస్ చైర్మన్, యం డి లు మాట్లాడారు .ఈ సమావేశం లో బోర్డు సభ్యులు బి జె పి నేత యన్ ఎస్ తులసీనాథ్, డైరెక్టర్లు అమీర్, ఆర్ముగం, తదితరులు పాల్గొన్నారు.

### జర్నలిస్ట్ లకు ఇళ్ల స్థలాలు

# మంజూరు చేయాలి

**కడ పి డి కి వినతి చేసిన కుప్పం నియోజక వర్గ జర్నలిస్టు లు**

**కుప్పం, పల్లె సాక్షి ప్రతినిధి, ఆగస్టు 5,** కుప్పం నియోజక వర్గం లో జర్నలిస్టు లకు జర్నలిస్ట్ కాలనీ ఏర్పాటు చేసి కుప్పం నియోజక వర్గ జర్నలిస్ట్ లకు ఇళ్ల స్థలాలు



మంజూరు చేయాలని బుధవారం కుప్పం లోని కడ కార్యాలయం లో కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మరమ్మత్ కు కుప్పం నియోజక వర్గ జర్నలిస్టు లు వినతి పత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రశాంత్, శివ, శ్రీనాథ్, ఆనంద్ ,లక్ష్మి నారాయణ, లక్ష్మి పతి,శివరాయల్, గోపి, గణేష్, చలపతి, లక్ష్మి పతి, హరి, తేజ, సత్యనారాయణ, వరదరాజులు, భూపతి, కృష్ణం రాజు, మంజు, ఉమర్, కిరణ్, తదితర నియోజక వర్గ పరిధిలో గల జర్నలిస్టు లు పాల్గొన్నారు.

### జిల్లా అభివృద్ధిపై సీఎం ని కలిసిన...

# ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర

**పార్వతీపురం పల్లె సాక్షి ప్రతినిధి,** అమరావతి సచివాలయంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పార్వతీపురం మన్యం జిల్లాలో కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయం, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం, జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయం, జిల్లా పశుసంవర్ధక శాఖ కార్యాలయం తదితర ప్రధాన జిల్లా స్థాయి ప్రభుత్వ కార్యాలయాలకు శాశ్వత భవనాల నిర్మాణం చేపట్టి, అవసరమైన నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి గారిని కోరారు. అదేవిధంగా, పార్వతీపురం మన్యం జిల్లాకు ఎంతో కీలకమైన జంజావతి ప్రాజెక్టు పనులను నిర్దేశించిన గడువుకంటే ముందుగానే పూర్తి చేసి, రైతులకు త్వరితగతిన సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ని విజ్ఞప్తి చేశారు.

# ప్రతి నీటి చుక్క ఒడిసి పట్టి నగరంలో నీటి కష్టాలకు చెక్ పెడతాం

**తుడా చైర్మన్ దివాకర్ రెడ్డి**

**తిరుపతి ఆగస్టు 05 (పల్లె సాక్షి ప్రతినిధి):** తిరుమల శేషాచల కొండల నుండి వచ్చే ప్రతి నీటి చుక్క ఒడిసి పట్టి నగరంలో నీటి కష్టాలకు చెక్ పెట్టేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని తుడా చైర్మన్ దివాకర్ రెడ్డి తెలిపారు. సిటీ ఆఫ్ లేక్స్ ప్రాజెక్ట్ లో భాగంగా మున్సిపల్, తుడా, ఇరిగేషన్ అధికారులతో కలిసి తుడా చైర్మన్ దివాకర్ రెడ్డి, కమిషనర్ శారదా దేవి లు నగరంలోని దివ్యారామం, మాల్వాడి గుండం, కపిల్ తీర్థం ఫారెస్ట్ ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తిరుపతి నగర ప్రజలకు త్రాగునీటి కొరత రాకుండా శేషాచల కొండల నుంచి వచ్చే వర్షపునీటిని నిలువ చేసేందుకు పరిశీలన చేశామన్నారు. నీటిని ఇక్కడే నిల్వ చేయడం భూగర్భ జలాలు పెరగడంతో పాటు తిరుపతి లో నీటి కొరత లేకుండా ఉంటుందన్నారు. కపిల్ తీర్థం ఫారెస్ట్ లో మూడు కుంటలు ఉన్నాయని వాటిని మరింత పెంచితే కొంతమేర నీటిని నిల్వ ఉంచేందుకు వీలుంటుందని తెలిపారు. 200 మీటర్ల మేర



ఇంకుడు గుంతలు ఏర్పాటు చేస్తే భూగర్భ జలాలు పెరుగుతాయని తెలిపారు. ఐదు కిలోమీటర్ల మేర ఉన్న ఈ ప్రదేశంలో మరింత పెద్దగా పాండ్స్ ఏర్పాటు చేయగలిగితే తిరుపతికి నీటి కొరత తీరుతుందని తెలిపారు. తిరుపతి ప్రజలతో పాటు, తిరుమలకు వచ్చే భక్తులకు తగినంత నీరు అందుబాటులో ఉంటుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ నిధులతో ప్రకృతికి దెబ్బ తినకుండా ఈ ప్రదేశంలో నీటి నిలువ చేసేందుకు తగు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. పేరూరు చెరువును కూడా సుందరంగా తీర్చిదిద్దుతున్నామని టెండర్లు కూడా పూర్తయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో తుడా సెక్రటరీ శ్రీకాంత్ బాబు, సూపరింటెండెంట్ ఇంజనీర్లు రవీంద్ర, శ్యాంసుందర్, ప్రసాద్, మునిసిపల్ ఇంజనీర్ గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డి.ఈ.లు ప్రసాద్, భాషా, హార్టికల్చర్ ఆఫీసర్ మాలతి, ఏసీపీ పార్వతి ప్రియ, మూర్తి, తుడా, మునిసిపల్, ఇరిగేషన్ అధికారులు ఉన్నారు.

### జంగంపల్లి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం..

# దంపతుల దుర్మరణం

**(పల్లె సాక్షి) పీలేరు మేజర్ న్యూస్:** అన్నమయ్య జిల్లా పీలేరు మండలం వేపులబయలు పంచాయతీ పరిధిలోని జంగంపల్లి సమీపంలోని అంకాలమ్మ గుడి వద్ద బుధవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో వృద్ధ దంపతులు మృతి చెందారు వివరాలు ఇలా



ఉన్నాయి బొమ్మిరెడ్డిగారిపల్లికి చెందిన వికలాంగుడు బండి చలపతి (70), ఆయన భార్య బండి సుబ్బమ్మ (60) ప్రస్తుతం పీలేరు బండ వీది లో నివాసముంటున్నారు. స్వగ్రామం నుంచి పీలేరుకు త్రిచక్ర వాహనంపై వస్తుండగా జంగంపల్లి సమీపంలోని అంకాలమ్మ గుడి వద్ద ఎదురుగా వచ్చిన కారు ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో బండి చలపతి ఘటనాస్థలంలోనే మృతి చెందగా, తీవ్రంగా గాయపడిన సుబ్బమ్మను స్థానికులు వెంటనే పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ ఆమె కూడా మృతి చెందింది.ఈ విషాద ఘటనతో కుటుంబ సభ్యులు, బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు.సమాచారం అందుకున్న పీలేరు పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు.

**టీడీపీ నాయకుల చే పి యం కె ఉడా చైర్మన్ డాక్టర్ సురేష్ బాబు జన్మ దిన సందర్భంగా**

# లక్ష్మీ పురం ఆలయం లో ప్రత్యేక పూజలు

**కుప్పం, పల్లె సాక్షి, ప్రతినిధి, ఆగస్టు 5,** ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు మాన్యశ్రీ నారా చంద్రబాబునాయుడు గారి ఆశీస్సులతో భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు



అధిరోహించాలని మనస్ఫూర్తి గా కోరుకుంటూ పి యం కె ఉడా చైర్మన్ డాక్టర్ బి.ఆర్.డి సురేష్ బాబు అన్న గారికి హార్దిక శుభాకాంక్షలు తెలు పుతూ లక్ష్మీపురం వరదరా జుస్వామి దేవస్థానం మరియు కుప్పం శ్రీరామలింగేశ్వర దేవస్థానం లో అభిషేకం పూజలు ప్రసాదం వినియోగించడం జరిగింది. ఈ కార్యక్రమం కు సీనియర్ నాయకులు రాష్ట్ర కార్యదర్శి పి గోపినాథ్ అన్న గారు,టీటీడీ బోర్డు మెంబెర్ శాంతరం అన్న గారు,బెండనకుప్పం బాబు అన్న గారు, ర్ ర్ రవి అన్న గారు, 20వ కౌన్సిలర్ సోమశేఖర్ గారు , యూనిట్ ఇంచార్జి వేణుగోపాల్ గారు,మునిసిపల్ చైర్మన్ సెల్వరాజ్ గారు, లక్ష్మీపురం హరి గారు, లక్ష్మీపురం లోకేష్ గారు,బూత్ ఇంచార్జి కే లోకేష్ బాబు గారు,మునిసిపల్ కార్యదర్శి దేవా గారు,గుళ్లేపల్లి రాజారామ్ అన్న గారు, డీకే పల్లి సోము అన్న గారు, డీకే పల్లి ప్రభాకర్ అన్న గారు,రెస్కో డైరెక్టర్ అర్ముగాం గారు, కౌన్సిలర్ సురేష్ గారు మరియు ఇతీ దీ=ఇ సురేష్ అన్న గారి శ్రేయోభిలాషులు టీడీపీ నాయకులు అభిమానులు కార్యకర్తలు పాల్గొన్నారు

### తెదేపా బలోపేతానికి కలిసి

# పని చేయండి

**జీడీ నెల్లూరు టీడీపీ అడ్డాగా మారాలి**

**ఎమ్మెల్యే థామస్, చిట్టిబాబులతో సీఎం**

**జీడి నెల్లూరు నియోజకవర్గ అభివృద్ధి పనులపై చర్చ**

**వెదురుకుప్పం, ఆగస్ట్ 5(పల్లె సాక్షి):** జీడి నెల్లూరు నియోజకవర్గంను తెలుగుదేశం పార్టీ అడ్డాగా మార్చాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్థానిక ఎమ్మెల్యే థామస్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి భీమినేని చిట్టిబాబు నాయుడులను ఆదేశించారు. బుధవారం అమరావతిలోని ముఖ్యమంత్రి కార్యాలయంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ జీడీ నెల్లూరు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ క్యాడర్ ను సమన్వయంతో ముందుకు నడిపించాలని అన్నారు. గతంలో కంటే పార్టీని మరింత బలోపేతం చేయడానికి బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఇద్దరు కలిసి పనిచేసి పార్టీ లక్ష్యాన్ని జనంలోకి తీసుకెళ్లాలన్నారు.



అభివృద్ధి పనులు గుర్తించి వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. రానున్న స్థానిక ఎన్నికలు ప్రతిష్టాత్మకంగా తీసుకుని క్షేత్ర స్థాయిలో కార్యకర్తలను బలంగా తీర్చి దిద్దాలని సూచించారు. ప్రతి బూత్ స్థాయిలో తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి కార్యకర్తలే నడుం బిగించేటట్లు చేయాలంటే వారికి అండగా మీరు నిలబడాలన్నారు. ఇదే స్ఫూర్తితో స్థానిక సంస్థల ఎన్నికల్లో తెదేపా అభ్యర్థుల గెలుపునకు బాటలు వేయాలన్నారు. అనంతరం నియోజకవర్గంలోని ప్రతిపాదిత సమస్యల వినతిపత్రం సీఎం కు అందజేశారు. ఈ సమావేశంలో ఎంఎస్ఎన్ డైరెక్టర్ చినబాబు, జీడీ నెల్లూరు నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు గుండయ్య, జీడి నెల్లూరు మండల మాజీ ప్రధాన కార్యదర్శి జ్యోతీశ్వర్ రెడ్డి, ఎస్ఆర్ పురం మాజీ టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు ఎం భాస్కర్ నాయుడు, పెనుమూరు కృష్ణమూర్తి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# డబుల్ రోడ్ నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్..

**సీఎం కు కృతజ్ఞతలు తెలిపిన గురుసాల కిషన్ చంద్**

**వెదురుకుప్పం, ఆగస్ట్ 5(పల్లె సాక్షి):** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని అమరావతిలో జీడీ నెల్లూరు ఎమ్మెల్యే వి.ఎం. థామస్ తో కలిసి వెదురుకుప్పం మండల అధ్యక్షులు గురుసాల కిషన్ చంద్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వెదురుకుప్పం మండల అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలను వివరించారు. పలు ప్రధాన ప్రతిపాదనలతో కూడిన వినతిపత్రాన్ని ముఖ్యమంత్రికి అందజేశారు. ఈ క్రమంలో కొత్తపల్లి మిట్ట నుండి పచ్చికాపల్లం వరకు కార్వేటినగరం నుండి పచ్చికాపల్లం వరకు డబుల్ రోడ్డు నిర్మాణం



అవసరాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొని వెళ్ళి వివరించగా సానుకూలంగా స్పందించి సమస్యను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని సీఎం హామీ ఇచ్చారని తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ అదినేతకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే థామస్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి భీమినేని చిట్టిబాబు నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

# పీలేరు,రాజీవ్‌నగర్ కాలనీవాసుల ఆందోళన

**రైల్వే ట్రాక్‌పై ఉన్న దారిని మూసివేయొద్దంటూ శాంతియుత నిరసన**

**ప్రజాప్రతినిధులతో చర్చించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని స్థానిక నాయకుల హామీ**

**పీలేరు మేజర్ న్యూస్ :** పీలేరు పట్టణంలోని రాజీవ్‌నగర్ కాలనీలో సుమారు 2,000 ఇళ్లలో వేలాది మంది నివాసం ఉంటున్నారు. ఈ కాలనీ ప్రజలు ఆర్టీసీ బస్టాండ్, వారపు సంత, ప్రభుత్వ ఆసుపత్రి తదితర ప్రాంతాలకు వెళ్లేందుకు ఎన్నో ఏళ్లుగా రైల్వే ట్రాక్‌పై ఉన్న దారినే ప్రధాన మార్గంగా ఉపయోగిస్తున్నారు. అయితే ఈరోజు బుధవారం ఆ దారిని రైల్వే శాఖ ఆధ్వర్యంలో మూసివేసే చర్యలు ప్రారంభించడంతో కాలనీవాసులు పెద్ద ఎత్తున శాంతియుత నిరసన చేపట్టారు.ఆ దారి మూసివేస్తే ఆర్టీసీ బస్టాండ్, వారపు సంత, ప్రభుత్వ ఆసుపత్రి వంటి కీలక ప్రాంతాలకు చేరుకోవడానికి రెండు నుంచి మూడు కిలోమీటర్లు అదనంగా చుట్టూ తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని తెలిపారు.అత్యవసర పరిస్థితుల్లో ఆలస్యమయ్యే అవకాశం ఉందని, విద్యార్థులు, ఉద్యోగులు, వృద్ధులు, మహిళలు నిత్యం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీకి ప్రత్యామ్నాయంగా సులభమైన దారి లేకపోవడంతో ప్రస్తుతం ఉన్న మార్గాన్ని కొనసాగించాలని వారు కోరారు.దారిని మూసివేస్తున్న రైల్వే కార్మికులను స్థానికులు అడ్డుకునే ప్రయత్నం చేయగా, తాము డివిజనల్ రైల్వే మేనేజర్ (డీఆర్ఎం) ఆదేశాల మేరకే ఈ చర్యలు చేపడుతున్నామని రైల్వే అధికారులు తెలిపారు ఈ



మార్గంలోని ట్రాక్ పై ప్రమాదాలపై స్థానికుల నుంచే పలుమార్లు ఫిర్యాదులు అందాయని, ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని, ప్రమాదాలను నివారించేందుకు డీఆర్ఎం ఆదేశాల మేరకు ఈ దారిని మూసివేస్తున్నామని పేర్కొన్నారు. ఈ మార్గంలో ప్రజల రాకపోకల కారణంగా గతంలో అనేక రైలు ప్రమాదాలు జరిగినట్లు, ప్రాణనష్టం చోటుచేసుకున్నట్లు వారు తెలిపారు.అలాగే రైల్వే ట్రాక్‌కు ఆనుకుని ఉన్న రైల్వే భూమిని కొంతమంది ఆక్రమించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ప్రయాణికుల భద్రతతో పాటు రైల్వే ఆస్తుల పరిరక్షణ దృష్ట్యా ఈ దారిని మూసివేస్తున్నామని రైల్వే సిబ్బంది ప్రజలకు వివరించారు.అయితే కాలనీవాసులు మాత్రం తమకు ఈ దారి అత్యంత అవసరమని, ప్రత్యామ్నాయ మార్గం లేదా ఫ్లైఓవర్ బ్రిడ్జి ఏర్పాటు చేసే వరకు దారిని మూసివేయడం సరికాదని పేర్కొంటూ శాంతియుతంగా నిరసన కొనసాగించారు.విషయం తెలుసుకున్న స్థానిక తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు షాజాద్ నాయకులు సీనా, మనీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మాజీ ఎంపీటీసీ నాగరాజు నాయక్ తదితరులు వచ్చి కాలనీవాసుల సమస్యను సంబంధిత ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు మరియు రైల్వే అధికారుల దృష్టికి తీసుకెళ్లి శాశ్వత పరిష్కారం కోసం కృషి చేస్తామని ప్రత్యామ్నాయ రహదారి లేదా ఫ్లైఓవర్ బ్రిడ్జి ఏర్పాటుపై సంబంధిత శాఖ అధికారులతో ప్రజాప్రతినిధుల తో చర్చించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకునేలా ప్రయత్నిస్తామని నాయకులు హామీ ఇవ్వడంతో కాలనీవాసులు తమ నిరసనను విరమించారు.రాజీవ్ నగర్ కాలనీ వంటి పెద్ద కాలనీలో వేలాది మంది ప్రజలు నివసిస్తున్న నేపథ్యంలో ప్రజల భద్రతను కాపాడుతూ, వారి రాకపోకలకు ఎలాంటి ఆటంకం కలగకుండా శాశ్వత పరిష్కారం చూపాలని కాలనీవాసులు ప్రభుత్వాన్ని, రైల్వే శాఖను కోరుతున్నారు.

## చిలకూరు PACS కి ప్రతిష్టాత్మక

# ఎక్సలెన్స్ అవార్డు

**ప్రోత్సాహించిన పెంచలకోన మాజీ చైర్మన్ తానంకి నానాజీ కి ధన్యవాదాలు**

**గూడూరు,ఆగస్టు05(పల్లె సాక్షి ప్రతినిది) :** ఆప్కాబ్ (ఆప్కాబ్) 63వ వార్షికోత్సవం సందర్భంగా పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని చిలకూరు ప్రాథమిక వ్యవసాయ



సహకార పరపతి సంఘానికి (ప్యాక్స్) "ఎక్సలెన్స్ అవార్డు" లభించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, ఈ విజయంలో కీలక పాత్ర పోషించిన పెంచలకోన దేవస్థానం మాజీ చైర్మన్ తానంకి నానాజీ ని చిలకూరు ప్యాక్స్ పాలకవర్గం మరియు సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ సంఘం అభివృద్ధికి, రైతులకు సేవలు అందించే క్రమంలో గూడూరు నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ పాశం సునీల్ కుమార్ సలహాలు సూచనలు తో మరియు తానంకి నానాజీ అందించిన నిరంతర సహకారం, సలహాలు మరియు ప్రోత్సాహం ఎంతో అమూల్యమైనవని పేర్కొన్నారు. తమ వెంటే ఉంటూ ముందడుగు వేయించినందుకు ఆయనకు ప్రత్యేకంగా హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. తానంకి నానాజీ మార్గదర్శకత్వంలో, అందరి సమష్టి కృషితో చిలకూరు ప్యాక్స్ భవిష్యత్తులో మరిన్ని గొప్ప పురస్కారాలు సాధించి, రైతు సంక్షేమానికి మరింత కృషి చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో కొండ రామచంద్రారెడ్డి(ప్యాక్స్ చిల్లకూరు అధ్యక్షులు), రజనేని రామానాయుడు (సి.ఈ.ఓ), సిబ్బంది కొండూరు రాధాకృష్ణ,కృష్ణపట్నం మల్లేశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

## నూతన చర్చ భవన నిర్మాణానికి...

# భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే నాని

**తిరుపతి చంద్రగిరి, ఆగస్టు 5 (పల్లె సాక్షి ప్రతినిధి):** చంద్రగిరి, కొత్తపేటలోని సౌత్ ఆంధ్ర లూతరెన్ చర్చ్ నూతన భవన భూమి పూజ కార్యక్రమానికి బుధవారం ముఖ్య



అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే పులివర్తి నానికు, చర్చ్ ఫాదర్లు -చర్చ్ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ "నూతన చర్చి నిర్మాణంలో తన వంతు సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు. పార్టీలకు, కుల-మతాలకు అతీతంగా కూటమి ప్రభుత్వం" పని చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, క్రిస్టియన్ సోదరీ- సోదరీమణులు పాల్గొన్నారు

## శ్రీ సుబ్రహ్మణ్య స్వామి ఆడి కృత్తిక మహోత్సవాలకు

# పటిష్ట పోలీస్ బందోబస్తు

**: పాకాల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చిన్న గోవిందు**

**పాకాల, ఆగస్టు 05 (పల్లె సాక్షి ప్రతినిధి)** పాకాల మండలంలోని ప్రసిద్ధ శ్రీ సుబ్రహ్మణ్య స్వామి దేవస్థానంలో ఘనంగా జరుగుతున్న 78వ ఆడి కృత్తిక మహోత్సవం సందర్భంగా



ఆలయానికి విచ్చేసే భక్తుల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ మరియు ట్రాఫిక్ నియంత్రణ కోసం తిరుపతి జిల్లా పోలీసు యంత్రాంగం భారీ బందోబస్తును ఏర్పాటు చేసింది. ఈ ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, సుదూర ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా సుమారు 268 మంది పోలీసు సిబ్బందితో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు పాకాల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ టీ చిన్న గోవిందు ఒక ప్రకటనలో తెలిపారు. భద్రతా వివరాలు: డీఎస్పీ: 01, సిఐలు: 04 మంది ఎస్ఐలు: 26 మంది ఇతర సిబ్బంది: ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళు ,, కానిస్టేబుళ్లు మరియు హోంగార్డులు కలిపి మొత్తం 268 మంది అధికారులు, సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. భక్తులందరూ పోలీసు రక్షణ సిబ్బందికి మరియు దేవస్థాన అధికారులకు సహకరించి, ట్రాఫిక్ నిబంధనలు, క్యూలైన్ విధానాన్ని పాటిస్తూ ప్రశాంతంగా స్వామివారిని దర్శించుకోవాలని పాకాల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ టి చిన్న గోవిందు కోరారు.

## కలకడలో సీఎంఆర్ఎఫ్ నిధులపై

# ప్రజల్లో గుసగుసలు...

**కలకడ :(పల్లె సాక్షి ప్రతినిధి )** కలకడ మండలంలో పేద ప్రజల వైద్య అవసరాల కోసం ప్రజాప్రతినిధుల సిఫారసులతో ముఖ్యమంత్రి సహాయ నిధి ( సీఎంఆర్ఎఫ్ )




ద్వారా అర్హులైన లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందుతోంది.అయితే, ఈ ప్రక్రియను ఆసరాగా చేసుకుని కొందరు వ్యక్తులు సీఎంఆర్ఎఫ్ ని తప్పుదోవ పట్టిస్తున్నారని గుసగుసలు స్థానిక ప్రజల్లో వినిపిస్తున్నాయి.ఈ ఆరోపణల్లో ఎంతవరకు వాస్తవం ఉందో సంబంధిత అధికారులు సమగ్రంగా విచారణ నిర్వహించి, అవసరమైతే వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని స్థానికులు కోరుతున్నారు.సీఎంఆర్ఎఫ్ అమలులో పూర్తి పారదర్శకత ఉండాలని, అర్హులైన లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

# మీ భవిష్యత్తు మీ చేతిలోనే ఉంది

**: ఆచార్య ఎల్ సి మల్లయ్య**

**కుప్పం ఆగస్టు 05 (పల్లె సాక్షి ప్రతినిధి):** మీ భవిష్యత్తు మీ చేతుల్లోనే ఉందని ద్రావిడ విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ విద్యార్థులకు ద్రావిడ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య











ఎల్ సి మల్లయ్య పిలుపు నిచ్చారు. బుధవారం ద్రావిడ విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ విభాగం ద్వారా నిర్వహిస్తున్న క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమంలో భాగంగా అకాడమిక్ బిల్డింగ్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఓ సమావేశంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులను ఉద్దేశించి ద్రావిడ వర్శిటీ ఉపకులపతి ఆచార్య ఎల్ సి మల్లయ్య మాట్లాడుతూ ద్రావిడ విశ్వవిద్యాలయంలో చదివే ప్రతి విద్యార్థి ఉద్యోగం చేయాలని ఆయన అన్నారు. విద్యార్థి దశలో క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించి సభ్య సమాజంలో ఉన్నతమైన స్థితికి చేరుకోవాలని ఆయన కోరారు. విద్యార్థులకు కావలసిన అన్ని సౌకర్యాలను విశ్వవిద్యాలయం కల్పించడంలో తామువెప్పుడూ ముందుంటామని విద్యార్థులకు ఆయన తెలియజేశారు. విద్యార్థి దశలో కష్టపడి చదివితే ఉన్నత స్థాయికి చేరుకోవడం చాలా సులభమన్నారు. ప్రతి విద్యార్థి ఎన్ఎస్ఎస్ విభాగంలోని మై భారత్ పోర్టల్ లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆయన తెలిపారు. అనంతరం ద్రావిడ విశ్వవిద్యాలయం కుల సచివులు ఆచార్య కిరణ్ కుమార్ మాట్లాడుతూ ద్రావిడ విశ్వవిద్యాలయంలో చదువుతున్న అన్ని కోర్సులు విద్యార్థులు ఎన్ఎస్ఎస్ విభాగంలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పరిసరాలను పరిశుభ్రంగా ఉండే విధంగా చూడాలని ఆయన కోరారు.

**ద్రావిడ విశ్వవిద్యాలయంలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం...** ద్రావిడ విశ్వవిద్యాలయంలోని ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ హర్షవర్ధన్ ఆధ్వర్యంలో బుధవారం ఎన్ఎస్ఎస్ విభాగం వారు విశ్వవిద్యాలయంలోని అకాడమిక్ బిల్డింగ్ ఆవరణంలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ద్రావిడ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య మల్లయ్య, రిజిస్టర్ ఆచార్య కిరణ్ కుమార్ లు ప్రారంభించారు. అకాడమిక్ బిల్డింగ్ ఆవరణంలోనీ పరిసరాలను ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు శుభ్రం చేశారు. అక్కడ ఉన్న పిచ్చి మొక్కలను తొలగించారు. అంతేకాకుండా అక్కడ పేరుకుపోయిన చెత్తను తొలగించారు. అక్కడ జరిగిన క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం ప్రిన్సిపాల్ ఆచార్య వర్ధిని, ఎన్ఎస్ఎస్ విభాగానికి చెందిన ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ హర్షవర్ధన్, ఎన్ఎస్-ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ హేమలత, డాక్టర్ వెంకటస్వామి, డాక్టర్ శైలమ్మ, డాక్టర్ మారియప్పన్, డాక్టర్ వరద రాజులు, డాక్టర్ సరస్వతి, అలాగే మాజీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఆచార్య యశోద, హిస్టరీ విభాగానికి చెందిన ఆచార్య అరవిఒద్, సుమారు 150 మందికి పైగా ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన

# ఎమ్మెల్యే వి.ఎం. థామస్

**టిడిపి మండల అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా ముఖ్యమంత్రిని కలిసిన గురసాల కిషన్ చంద్.**

**వెదురుకుప్పం ఆగస్టు 05 (పల్లె సాక్షి ప్రతినిధి):** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని జి.డి. నెల్లూరు ఎమ్మెల్యే వి.ఎం. థామస్ బుధవారం



మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాల గురించి వివరించారు. అమరావతిలోని ముఖ్యమంత్రి కార్యాలయంలో జరిగిన ఓ సమావేశంలో, ఎమ్మెల్యే వి.ఎం. థామస్ తో పాటు వెదురుకుప్పం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కిషన్ చంద్ హాజరయ్యారు. గంగాధర నెల్లూరు శాసనసభ్యులు వీఎం థామస్ వెదురుకుప్పం మండల పార్టీ అధ్యక్షులు కిషన్ చంద్ ను ముఖ్యమంత్రి కి పరిచయం చేస్తూ, పార్టీ బలోపేతం కోసం ఆయన అందిస్తున్న సేవలను వివరించారు. అనంతరం నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు ప్రధాన ప్రతిపాదనలతో కూడిన వినతిపత్రాన్ని ముఖ్యమంత్రి కి అందజేశారు. ఈ సందర్భంగా కొత్తపల్లి మిట్ట -- పచ్చికాపలం - కార్వేటినగరం డబుల్ రోడ్డు నిర్మాణం అత్యంత అవసరమని కిషన్ చంద్, ఎమ్మెల్యే వి.ఎం. థామస్ సమక్షంలో ముఖ్యమంత్రి గారి దృష్టికి తీసుకెళ్లగా, ముఖ్యమంత్రి అందుకు సానుకూలంగా స్పందించి సమస్యను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని కిషన్ చంద్ తెలిపారు

## జర్నలిస్ట్ నాయకుడు జనార్ధన్

# జన్మదిన వేడుకలు

**తిరుపతి, ఆగస్టు 5లి(పల్లె సాక్షి ప్రత్యేక ప్రతినిధి)** సీనియర్ జర్నలిస్టు, జర్నలిస్టుల సమస్యలపై అలుపెరగని ఉద్యమాలు చేస్తున్న వెటరన్ జర్నలిస్టుల అసోసియేషన్ ఏపి రాష్ట్ర



అధ్యక్షులు, ఆల్ ఇండియా వెటరన్ జర్నలిస్ట్ అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ తూపల్లి జనార్ధన్ జన్మదినం సందర్భంగా బుధవారం పలువురు ఆయనకు శుభాకాంక్షలు అందజేసారు. సీనియర్ జర్నలిస్ట్ ఆదిమూలం కార్యలయంలో డాక్టర్ జనార్ధన్ ను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపి మీడియా ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి కల్లుపల్లి సురేంధర్ రెడ్డి, తిరుపతి జిల్లా సంయుక్త కార్యదర్శి గాదె మునిచంద్రా రెడ్డి, సీనియర్ జర్నలిస్టులు నరేంద్రరెడ్డి, సెల్వరాజ్, చంద్రశేఖర్, సుకుమార్ తదితరులు వున్నారు.

## 12 నుంచి జిల్లాలో ఎయిడ్స్...

# అవగాహన కార్యక్రమాలు

**సమన్వయంతో పనిచేసి కార్యక్రమాలను విజయవంతం చేయాలి**

**జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి అధికారి డాక్టర్ రాధిక**

**మదనపల్లె, ఆగస్టు 5: (పల్లె సాక్షి జిల్లా ప్రతినిధి)** అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 12వ తేదీ నుంచి అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా ఎయిడ్స్‌పై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా ఎయిడ్స్ నియంత్రణ మండలి అధికారి డాక్టర్ రాధిక తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పరస్పర సమన్వయంతో పనిచేసి కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆమె సూచించారు.




స్థానిక జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ కార్యాలయంలో డిశా ఆధ్వర్యంలో ఐసీటీసీ కౌన్సిలర్లు, ఏఆర్టీ కేంద్రాల ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల (ఎన్‌జీఓ) ప్రతినిధులతో నెలవారీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాధిక మాట్లాడుతూ..జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ శివ్ నారాయణ శర్మ ఆదేశాల మేరకు రెండు నెలలపాటు హైరిస్క్ గ్రామాలు, కళాశాలలు మరియు ఇతర ప్రాంతాల్లో ఎయిడ్స్‌పై విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఐసీటీసీ సిబ్బంది, ఎన్‌జీఓలు సమన్వయంతో పనిచేసి ప్రజల్లో అవగాహన కల్పించాలని కోరారు. మిషన్ ఎయిడ్స్ సురక్ష (హీూ) కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ఎయిడ్స్ నియంత్రణ చర్యలను ప్రతి స్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ఆరోగ్య కేంద్రాల్లో హెచ్‌ఐవీ పరీక్షలు, కౌన్సెలింగ్, మందుల సరఫరా తదితర సేవలు ఎలాంటి అంతరాయం లేకుండా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఉమ్మడి జిల్లాల ఎయిడ్స్ నియంత్రణ క్లస్టర్ ప్రోగ్రామ్ అధికారి వేంపల్లి భాస్కర్ మాట్లాడుతూ, ప్రైవేట్ ఆసుపత్రులు ప్రభుత్వ మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటిస్తూ సేవలు అందించాలని సూచించారు. ముఖ్యంగా గర్భిణీ స్త్రీలకు అవసరమైన హెచ్‌ఐవీ పరీక్షలు, వైద్య సేవలు సకాలంలో అందేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ఈ సమావేశంలో డిశా ప్రివెన్షన్ అధికారి ఆనంద్, కౌన్సిలర్లు జయకుమార్, చంద్ర, ఎన్‌జీఓ ప్రతినిధులు అలావల్లి, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

## అమ్మ వారి జాతర లో పాల్గొన్న

# వాల్మీకి ధర్మ సమాజం నాయకులు

**మదనపల్లె, ఆగష్టు5:(పల్లె సాక్షి జిల్లా ప్రతినిధి)** మదనపల్లి మండలం లో బొగ్గిటి వారి పల్లెలో



అమ్మవారి జాతర కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్రీయ వాల్మీకి ధర్మ సమాజ రాష్ట్ర అధ్యక్షుడు మేకల విజయ్ మోహన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూలకుంట్ల హరిబాబు మరియుబొగ్గిటి వారి పల్లి శివ. శీనా. శ్రీరాములు.మల్లి. చంద్ర. గౌరమ్మ. చంద్ర కళ.. రెడ్డెమ్మ యశోద. గంగులమ్మ. ు రెడ్డెమ్మ.. రాష్ట్రీయ వాల్మీకి ధర్మ సమాజ్ నాయకులు మోహన నానీ శివ అనిల్. శ్రీనివాసులు. గోపి. మల్లికార్జున. పాల్గొన్నారు

# సమస్యను పరిష్కరించి గ్రామానికి రోడ్లు వేయిస్తున్న ఎమ్మెల్యే

**ప్రజా సంక్షేమం, గ్రామాభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే పులివర్తి నాని**

**40 సంవత్సరాల కల నెరవేర్చిన ఎమ్మెల్యే నానికి గెరికనెట్టు గ్రామస్తుల ప్రత్యేక కృతజ్ఞతలు**

**పాకాల, ఆగస్టు 05 (పల్లె సాక్షి ప్రతినిధి):** ప్రజా సంక్షేమం, శ్రేయస్సుతో పాటు పంచాయతీల్లోని గ్రామాల సర్వతోముఖాభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని చంద్రగిరి శాసనసభ్యులు పులివర్తి నాని పేర్కొన్నారు. పాకాల మండలం మొగరాల పంచాయతీ పరిధిలోని గెరికనెట్టు గ్రామంలో కొత్తగా నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై భూమిపూజ కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామానికి విచ్చేసిన ఎమ్మెల్యే కి మండల స్థాయి అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పులివర్తి నాని మాట్లాడుతూ.. ప్రజలకు





నాణ్యమైన మౌలిక వసతులు కల్పించడమే తమ ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని తెలిపారు. గత 40 సంవత్సరాలుగా సరైన రోడ్డు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న గెరికనెట్టు గ్రామస్తుల సమస్యను గుర్తించి, దానికి శాశ్వత పరిష్కారం చూపుతూ రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టడం జరిగింది. నలభై ఏళ్ల నాటి ప్రధాన సమస్యను పరిష్కరించి గ్రామానికి రోడ్డు నిర్మిస్తున్నందుకు గ్రామస్తులు ఎమ్మెల్యే కి ప్రత్యేక ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ భూమిపూజ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

పల్లె సాక్షి
APTEL 2022 / 16169
pallesakshi2022@gmail.com



## సోమల పురవీధుల్లో వైభవంగా...

# పాలేటి గంగమ్మ ఊరేగింపు

**పుట్టినిల్లుగా భావించే పాయల వంశస్థుల నుంచి చీరసారె స్వీకరించిన అమ్మవారు**

**సోమల, పల్లె సాక్షి,ఆగస్టు 5:** సోమలలో పాలేటి గంగమ్మ అమ్మవారి జాతర ఉత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా కొనసాగుతున్నాయి. బుధవారం అమ్మవారు తన పుట్టినిల్లుగా



భావించే పాయల వంశస్థుల ఇంటికి చేరుకుని సంప్రదాయం ప్రకారం చీరసారె స్వీకరించారు. అనంతరం ప్రత్యేక అలంకరణతో అమ్మవారిని సోమల పురవీధుల్లో ఊరేగించగా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని హారతులు ఇచ్చారు. ఊరేగింపు సందర్భంగా డప్పు వాయిద్యాలు, మంగళ వాయిద్యాలు, భక్తుల జైజైధ్వానాలతో సోమల పురవీధులు ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడాయి. గ్రామస్థులు అమ్మవారికి కొబ్బరికాయలు, పండ్లు, పుష్పాలతో ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామానికి సుఖశాంతులు, సస్యశ్యామలత్వం కలగాలని ప్రార్థించారు. ఈ ఉత్సవాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు

## వైసిపి కాలయాపనకు స్వస్తి...రెవిన్యూ శాఖ ప్రక్షాళనతోనే

# రాజముద్ర పాస్ బుక్కుల పంపిణీ

**1256 మంది రైతులకు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి పంపిణీ**

**రైతు సంక్షేమే కూటమి ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే**

**భూ సమస్యలు లేని నియోజవర్గంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యం**

**కలికిరి పల్లె సాక్షి :** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు రెవెన్యూ శాఖలో సమూల ప్రక్షాళన చేపట్టిందని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి అన్నారు. అన్నమయ్య జిల్లా : కలికిరి మండలం కె.రెడ్డివారిపల్లి గ్రామంలో 1256 మంది రైతులకు రాజముద్రతో కూడిన నూతన పాస్ బుక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నల్లారి మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో జగన్మోహన్ రెడ్డి పాస్ బుక్కులు, నెంబర్ రాళ్లపై సొంత ఫోటోలు ముద్రించుకుని ప్రచార ఆర్భాటానికే పరిమితమయ్యారని విమర్శించారు. సర్వేలు చేపట్టకుండా, రైతుల సమస్యలు పట్టించుకోకుండా కాలయాపన చేశారని ఆరోపించారు. చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా రీ సర్వే చేపట్టి, రైతుకు చెందిన భూముల వివరాలను స్పష్టంగా పాస్ బుక్కులో నమోదు చేసి రాజముద్రతో అందజేస్తోందని తెలిపారు. ఇదే నిజమైన పాలనకు, రైతు సంక్షేమానికి నిదర్శనమని పేర్కొన్నారు. చంద్రబాబు గారి నాయకత్వంలో రైతు సంక్షేమమే ధ్యేయంగా రైతులకు అండగా ఉంటూ, పీలేరు నియోజకవర్గ అభివృద్ధి కి ఆదర్శంగా నిలుపుతారని, సమస్యలు లేని నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే తమ కర్తవ్యం గా భావిస్తానని ఆయన అన్నారు. రైతుల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం మరిన్ని పథకాలు, సహాయ కార్యక్రమాలు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటుందని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజన్ ఆర్డీవో కె.విజయలక్ష్మి, కలికిరి తహశీల్దార్ సయ్యద్ అహ్మద్, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, నల్లారి అభిమానులు, రెవెన్యూ సిబ్బంది, రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

## పొగాకు రైతుల సంక్షేమంపై జగన్‌మోహన్‌రెడ్డికి

# బహిరంగ సవాల్

**వాస్తవాలు, గణాంకాలతో చర్చకు సిద్ధమా జగన్? రైతుల కోసం చేసింది ఎవరు? మాటలు చెప్పింది ఎవరు? ప్రజల ముందే తేల్చుకుందాం – మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**

**అమరావతి, ఆగస్ట్ 05: పల్లె సాక్షి :** పొగాకు రైతుల సంక్షేమంపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవాలపై ఆధారపడినవని, రైతులపై



నిజంగా చిత్తశుద్ధి ఉంటే వాస్తవాలు, గణాంకాలతో బహిరంగ చర్చకు రావాలని జగన్‌మోహన్‌రెడ్డికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు బహిరంగ సవాల్ విసిరారు. బుధవారం విజయవాడలోని ఓ ప్రైవేట్ హోటల్ లో మీడియాతో మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి గారూ... మీరు పొగాకు రైతుల కష్టాల గురించి మాట్లాడుతున్నారు, కానీ వాస్తవాలు, గణాంకాలతో బహిరంగ చర్చకు రావడం లేదు. రైతులపై నిజమైన చిత్తశుద్ధి ఉంటే ఈ సవాలును స్వీకరించండి. పొగాకు రైతులు సంక్షోభంలో ఉన్న ప్రతిసారీ వారిని ఆదుకున్నది టీడీపీ నాయకత్వంలోని ప్రభుత్వమే. రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రతిసారీ అండగా నిలిచి నిర్ణయాలు తీసుకున్న చరిత్ర టీడీపీ ప్రభుత్వానిదే. గత సంవత్సరం బర్లీ పొగాకు రైతుల నుంచి 25 మిలియన్ కిలోల పొగాకును కొనుగోలు చేసి, సుమారు రూ.280 కోట్లు వెచ్చించడం జరిగింది. 2014-15లో ఎఫ్‌సీవీ పొగాకు ధరలు పడిపోయినప్పుడు, వాణిజ్య పంట అయినప్పటికీ రైతులు నష్టపోకూడదనే ఉద్దేశంతో ప్రతి కిలోకు రూ.20 ఆర్థిక సహాయం అందించడం జరిగింది. చరిత్రలోనే ఇది ఒక కీలక నిర్ణయం. అయితే, మీ ప్రభుత్వ హయాంలో 2019లో సుమారు 124 మిలియన్ కిలోల పొగాకు ఉత్పత్తి కాగా, ధర కిలోకు రూ.121--123కు పడిపోయింది. అయినప్పటికీ మీ ప్రభుత్వం కేవలం 11.8 మిలియన్ కిలోలను మాత్రమే కొనుగోలు చేసి, మిగిలిన రైతులను గాలికి వదిలేసింది. తదుపరి సంవత్సరం సుమారు 128 మిలియన్ కిలోల పొగాకు ఉత్పత్తి అయి, ధర కిలోకు రూ.123కు పడిపోయినప్పటికీ, మీ ప్రభుత్వం ఒక్క కిలో కూడా కొనుగోలు చేయలేదు. రైతులకు ఎలాంటి అదనపు ఆర్థిక సహాయమూ అందించలేదు.

**పొగాకు ధరల విషయంలో కూడా వాస్తవాలు ప్రజల ముందున్నాయి...**

- 2019లో కేజీ రూ.142 - 2020లో రూ.140 - 2021లో రూ.161 - 2022లో రూ.192 - 2023లో రూ.248 - 2024లో కూటమి ప్రభుత్వ హయాంలో రూ.326 - 2025లో రూ.300 - 2026లో రూ.275

ప్రస్తుత సంవత్సరం టొబాకో బోర్డు లక్ష్యం 131 మిలియన్ కిలోలు కాగా, రైతులు సుమారు 241 మిలియన్ కిలోలు ఉత్పత్తి చేశారు. అధిక ఉత్పత్తితో ఇబ్బందులు ఎదురైన రైతులను ఆదుకోవడానికి కూటమి ప్రభుత్వం వెంటనే ముందుకొచ్చింది. సుమారు 100 మిలియన్ కిలోల పొగాకుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతి కిలోకు రూ.10 చొప్పున మొత్తం రూ.100 కోట్ల ఆర్థిక సహాయం అందించాలని నిర్ణయించింది. ఈ సహాయం పంపిణీని రేపటి నుంచే ప్రారంభిస్తున్నాం. అంతేకాదు... అంచనాకు మించి పొగాకు వచ్చినా, దానికి కూడా ప్రతి కిలోకు రూ.10 చొప్పున సహాయం అందించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. రాష్ట్ర ప్రభుత్వ సహాయంతోపాటు, కేంద్ర ప్రభుత్వం ప్రతి పొగాకు బ్యారన్‌కు రూ.50,000 వడ్డీలేని రుణం అందిస్తోంది. ఈ వాస్తవాలన్నింటి తర్వాత కూడా పొగాకు రైతుల గురించి కూటమి ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కు జగన్‌మోహన్‌రెడ్డికి లేదు. గత ప్రభుత్వ పనితీరు, కూటమి ప్రభుత్వ సహాయంపై గణాంకాలతో బహిరంగ చర్చకు రావాలని మరోసారి సవాలు చేస్తున్నాం. రైతులు గత ప్రభుత్వ పనితీరును, ప్రస్తుత కూటమి ప్రభుత్వం అందిస్తున్న సహాయాన్ని పోల్చి చూడండి. ఎవరు రైతులను గాలికి వదిలేశారో, ఎవరు కష్టకాలంలో అండగా నిలిచారో ప్రజలే నిర్ణయిస్తారని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు.

# గంగపుత్రుల వారసత్వ భూమిపై కబ్జా యత్నాన్ని అడ్డుకుంటాం

**చట్టవిరుద్ధ ఆక్రమణలకు తావులేదు....బాధిత మహిళలకు టీడీపీ అండగా ఉంటుంది**

**రాష్ట్ర టీడీపీ అధికార ప్రతినిధి నరవ రమాకాంత్ రెడ్డి భరోసా**

**పెద్దకడబూరు ఆగష్టు 05 (పల్లెసాక్షి):** మండల కేంద్రమైన మంత్రాలయం గ్రామ పరిధిలోని సర్వే నెం. 111/3లో గంగపుత్రుల కుటుంబానికి చెందిన మహిళలకు సుమారు 8 సెంట్ల విలువైన స్థలం ఉందని,ఆ భూమి వారి తల్లిదండ్రులు గిఫ్ట్ డీడ్ ద్వారా చట్టబద్ధంగా రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వడంతో వంశపారంపర్యంగా సంక్రమించిన ఆస్తిగా ఉందని రాష్ట్ర టీడీపీ అధికార ప్రతినిధి నరవ రమాకాంత్ రెడ్డి తెలిపారు. బాధిత కుటుంబం





తమ స్థలం చుట్టూ రక్షణ కోసం గతంలోనే బండలు ఏర్పాటు చేసుకున్నప్పటికీ,ఇటీవల కొందరు వైసీపీకి చెందిన స్థానిక నేతలు వాటిని ధ్వంసం చేసి భూమిని అక్రమంగా కబ్జా చేసేందుకు ప్రయత్నించారని ఆయన ఆరోపించారు.విషయం తెలుసుకున్న టీడీపీ రాష్ట్ర రైతు అధికార ప్రతినిధి నరవ రమాకాంత్ రెడ్డి బుధవారం సాయంత్రం,సొసైటీ చైర్మన్ మీసేవ ఆంజినేయులు,బీసీ సాధికారిత రాష్ట్ర కమిటీ సభ్యులు డి.మల్లికార్జున, డీలర్స్, ఎం.ఆదాము జి.ఆశన్న లతో, కలసి సంఘటన స్థలాన్ని పరిశీలించి బాధిత మహిళలతో మాట్లాడి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. మహిళల పేరపై చట్టబద్ధంగా నమోదైన ఈ వారసత్వ ఆస్తిపై ఎలాంటి అక్రమ కబ్జాలను కూడా సహించబోమని,బాధిత కుటుంబానికి తెలుగుదేశం పార్టీ అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు.భూమి కబ్జాలు,దౌర్జన్యాలు,బెదిరింపులు వైసీపీ నాయకుల సంస్కృతిగా మారిపోయాయని ఆయన విమర్శించారు. చట్టబద్ధమైన ఆస్తులను బలవంతంగా స్వాధీనం చేసుకునే ప్రయత్నాలు ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగానికి విరుద్ధమని పేర్కొన్నారు. అంతేకాకుండా, కబ్జాదారులకు స్థానిక ఎమ్మెల్యే వంతు పాడడం ఆశ్చర్యకరంగా ఉందని,చట్టవిరుద్ధమైన కబ్జాలను ఖండించి బాధితులకు న్యాయం చేయాల్సిన ప్రజాప్రతినిధులు అక్రమాలకు మద్దతుగా మాట్లాడటం వారి వైఖరికి నిదర్శనమని టీడీపీ నేత నరవ రమాకాంత్ రెడ్డి విమర్శించారు. సంబంధిత రెవెన్యూ,పోలీసు శాఖ అధికారులు వెంటనే సంఘటన స్థలాన్ని పరిశీలించి,భూమి రికార్డులను పరిశీలించి వాస్తవాలను నిర్ధారించాలని,కబ్జాకు యత్నించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. మహిళల ఆస్తి హక్కులకు భంగం కలిగించే వారిని ఉపేక్షించరాదని ప్రభుత్వాన్ని కోరారు. బాధిత మహిళలు ఎలాంటి భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని,వారి ఆస్తికి పూర్తి రక్షణ కల్పించేలా అన్ని చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు తెలుగుదేశం పార్టీ అండగా నిలుస్తుందని టీడీపీ రాష్ట్ర రైతు అధికార ప్రతినిధి నరవ రమాకాంత్ రెడ్డి భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎం.రామన్న బాధిత మహిళలు సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు దాసప్పరెడ్డి బాధిత మహిళల బంధువులు టిడిపి నాయకులు గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

# బీసీ నేతలపై అక్రమ కేసులు దారుణం..

**కూటమి ప్రభుత్వం తీరుపై వైయస్సార్ సిపి బిసి మహిళ నేత"నిషాద్ విమర్శలు**

**బెల్లంకొండ ఆగస్టు 5,పల్లె సాక్షి,** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పుడు నుంచి బిసి సామాజిక వర్గాలను లక్ష్యంగా చేసుకొని కక్ష సాధింపు రాజకీయాలకు పాల్పడుతుందని



మండల వైఎస్సార్సీపీ బీసీ మహిళా నేత షేక్ నిషాద్ విమర్శించారు. మండల కేంద్రంలోని తన నివాసంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ..ప్రభుత్వ తీరుపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గుంటూరు ఈస్ట్ మాజీ ఎమ్మెల్యే షేక్ ముస్తఫా కుమారుడిని అర్ధరాత్రి అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు.మాజీ ఎమ్మెల్యే ముస్తఫాపై కిడ్నాప్, హత్యయత్నం వంటి సెక్షన్లు నమోదు చేసి వేధించడం దుర్మార్గమని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలపై వరుసగా అక్రమ కేసులు నమోదు చేసి అరెస్టులు చేస్తున్నారని అధికారాన్ని అడ్డం పెట్టుకొని ప్రతిపక్షాన్ని అణిచివేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు.ప్రజాస్వామ్య విలువలను కాపాడాల్సిన పోలీసులు చట్టానికి విరుద్ధంగా ఏకపక్షంగా వ్యవహరించటం సరికాదన్నారు.ఇలాంటి చర్యలను ప్రజల గమనిస్తున్నారని అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్న వారిని ప్రజలు తగిన సమయంలో నిలదీస్తారని పేర్కొన్నారు.రాజకీయ వేధింపులు, అక్రమ కేసులతో వైఎస్ఆర్సిపి నాయకులను భయపెట్టడం సాధ్యం కాదని ఆమె స్పష్టం చేశారు.

## ప్రపంచ ఆదివాసీ దినోత్సవానికి

# గౌరవం దక్కాలి

**ఆగస్టు 9ను పబ్లిక్ హాలిడేగా ప్రకటించాలి**

**జిల్లా కలెక్టర్‌కు ఆదివాసీ కాంగ్రెస్ వినతి**

**తిరుచానూరు :** ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం ఆగస్టు 9వ తేదీని తిరుపతి జిల్లాలో పబ్లిక్ హాలిడేగా ప్రకటించాలని కోరుతూ తిరుపతి జిల్లా ఆదివాసీ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్‌కు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా జిల్లా ఆదివాసీ కాంగ్రెస్ కమిటీ జిల్లా చైర్మన్ కె. జ్యోతిశ్వర్ నాయక్ మాట్లాడుతూ, ప్రతి ఏడాది ఆగస్టు 9న నిర్వహించే ప్రపంచ ఆదివాసీ దినోత్సవం ఆదివాసీ సమాజ చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు, భాషలు, జీవన విధానం, రాజ్యాంగబద్ధమైన హక్కులను గౌరవించే అత్యంత ప్రాధాన్యమైన రోజుగా గుర్తింపు పొందిందని తెలిపారు.అఖిల భారత ఆదివాసీ కాంగ్రెస్ జాతీయ చైర్మన్ డాక్టర్ విక్రాంత్ భూరియా, ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు రీమాల నవభారత్ ఆదేశాల మేరకు దేశవ్యాప్తంగా జిల్లా కలెక్టర్లకు వినతిపత్రాలు సమర్పిస్తున్న కార్యక్రమంలో భాగంగానే తిరుపతి జిల్లాలో కూడా ఈ వినతిపత్రం అందజేసినట్లు పేర్కొన్నారు.

## (ఏఐఎస్ఎఫ్), (ఏఐవైఎఫ్) నాయకుల...

# అక్రమ కేసులు ఎత్తివేయాలి..

**పత్తికొండ ఎమ్మెల్యే శాసనాలను చేసే స్థాయి ఉండి , ప్రజాస్వామ్య విలువలను ఉల్లంఘించడం సరికాదు**

**కోసిగి టుడే ( పల్లె సాక్షి) ఆగస్టు 05 :** మహాత్మ జ్యోతి రావు పూలే గురుకుల పాఠశాలను పత్తికొండ లోనే ఏర్పాటు చేయాలి.శాంతి యుతంగా ఆందోళన చేస్తున్న నాయకులపై అక్రమ కేసు నమోదు చేసిన పట్టణ సిఐ జయన్న ను తక్షణమే సస్పెండ్ చేయాలి,, ఏఐఎస్ఎఫ్ డిమాండ్ మహాత్మ జ్యోతి రావు పూలే గురుకుల పాఠశాలను పత్తి కొండ నియోజకవర్గ కేంద్రంలోనే ఏర్పాటు చేయాలని ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో నిన్నటి రోజున పత్తికొండ పట్టణంలో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకుల




ను అక్రమంగా అరెస్టు చేసి అక్రమ కేసులు బనాయించడాన్ని తీవ్రంగా ఖండిస్తు ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో శ్రీ చైతన్య స్కూల్ ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహించారు ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు యస్.ఈరేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పత్తికొండ నియోజకవర్గానికి కేటాయించిన మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలను నియోజకవర్గ కేంద్రంలో నిర్మించకుండా, స్థానిక ఎమ్మెల్యే తన యొక్క స్వార్ధ ప్రయోజనాల దృష్ట్యా, స్వగ్రామం కంబాలపాడు గ్రామంలో ఏర్పాటు చేయడం సరైన పద్ధతి కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు.పత్తికొండ నియోజకవర్గం కేంద్రంలో ఏర్పాటు చేయడం ద్వారా పరిసర గ్రామీణ ప్రాంత విద్యార్థులందరూ కూడా అందుబాటులో ఉంటుందని, రవాణా సౌకర్యం మరి యు అధికారుల పర్యవేక్షణ ఉంటుందని అన్నారు. ఎలాంటి రవాణా సౌకర్యం లేనటువంటి మారుమూల ప్రాంతంలో ఏర్పాటు చేయడం ద్వారా విద్యార్థులు అనేక ఇబ్బందులకు గురవుతారని, అధికారుల పర్యవేక్షణ లోపంతో పాఠశాలల యొక్క సమస్యలను విద్యార్థి బాగోగులను చూడడం కరువైతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే సమస్యపై ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో గత కొన్ని రోజులుగా వివిధ రూపాల్లో అనేక ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఏమాత్రం కూడా స్థానిక ఎమ్మెల్యే గారు పట్టించుకోకపోగా, స్పందించకుండా పైగా ఆ సమస్యపై ఉద్యమించిన ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులను అక్రమంగా అరెస్టు చేయించడం, 7 మందిపై అక్రమ కేసులు బనాయించడం ప్రజాస్వామ్య విలువలను అపహాస్యం చేయడమేనని అన్నారు. ఎమ్మెల్యే గారి గ్రామం పై ప్రేమాభిమానం ఉంటే స్వయంగా పాఠశాల కొరకు స్థలం కేటాయించి ప్రభుత్వ నుండి ఉత్తర్వులు పొంది, విద్యనందించవలసిందిగా కోరుతున్నాం అన్నారు ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకుల అక్రమ అరెస్టుకు మరియు అక్రమ కేసులను భినయించడం సమాజసం కాదు రాజకీయ పార్టీ కొత్తగా మారి విద్యార్థి యువజన సంఘ నాయకులపై కేసు బినయించిన పత్తికొండ పట్టణ సిఐ జయన్న ను తక్షణమే సస్పెండ్ చేయాలని ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి వారు డిమాండ్ చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర విద్యా శాఖ మంత్రి తక్షణమే స్పందించి , మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలను పత్తికొండ నియోజకవర్గ కేంద్రంలోనే ఏర్పాటు చేయాలని లేని పక్షంలో వివిధ రూపాల ద్వారా ఆందోళన కార్యక్రమాలు నిర్వహించి ఎమ్మెల్యే ఇంతటి ముట్టడికి కూడా శ్రీకారం చుడతామని ఈ సందర్భంగా హెచ్చరించారు అనంతరం ఈ కార్యక్రమంలో,శివకృష్ణ వీరేంద్ర రామంజి నరసింహ కుమార్ మల్లికార్జున దూద్ భాషా వన్నూరు వల్లి శీను సంతోష్ శివకుమార్ రఘు కృష్ణ శివ తదితరులు పాల్గొన్నారు.

## సౌలహళ్లి భూమి వివాదంపై, జై భీమ్ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు

# చిక్కం జానయ్య అసత్య ప్రచారం మానుకోవాలి

**టిడిపి నాయకులు బొగ్గుల తిక్కన్న కార్తికేయ**

**పెద్దకడబూరు ఆగష్టు 05 (పల్లెసాక్షి):** మంత్రాలయం మండలంలోని సౌలహళ్లి గ్రామ సర్వే నెం. 19/దీ1గా 2.89,భూమికి సంబంధించి జై భీమ్,ఎంఆర్పీఎస్ వ్యవస్థాపకులు చిక్కం జానయ్య ,బృందం చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అసత్యమని టిడిపి నాయకులు బొగ్గుల తిక్కన్న కార్తికేయ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రమైన పెద్దకడబూరులో ఒక పత్రిక ప్రకటన విడుదల చేశాడు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,ఈ భూమి వ్యవహారం ప్రస్తుతం గౌరవ హైకోర్టు ఆదేశాల మేరకు చట్టపరమైన విచారణలో ఉందని, హైకోర్టు ఇరుపక్షాల వాదనలు, ప్రభుత్వ రికార్డులు పరిశీలించి కారణాలతో కూడిన ఉత్తర్వులు ఇవ్వాలని మాత్రమే మంత్రాలయం ఎమ్మార్వోను ఆదేశించిందని ఆయన తెలిపారు. ఏ ఒక్క వర్గానికీ అనుకూలంగా నిర్ణయం ఇవ్వాలని కోర్టు ఎక్కడా చెప్పలేదని స్పష్టం చేశారు.హైకోర్టు ఆదేశాల మేరకు ప్రస్తుతం సాగులో ఉన్న హరిజన ముత్తమ్మ సాగుకు ఎలాంటి ఆటంకాలు కలిగించకూడదని విచారణలో మరో పక్షం పేర్కొన్న విషయాన్ని గుర్తుచేశారు. ఎమ్మార్వోపై రాజకీయ ఒత్తిడి, అధికార పార్టీ జోక్యం ఉందన్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమని ఆయనఅన్నారు. అలాగే,మంగళవారం మంత్రాలయం రోడ్డుపై జరిగిన ఘటనకు



సంబంధించి కొందరిపై కర్నూలు జిల్లా కోర్టులో కేసు విచారణలో ఉందని, పూర్తి వాస్తవాలు తెలుసుకోకుండా ఆరోపణలు చేయడం సరికాదని హితవు పలికారు.ప్రజలను రెచ్చగొట్టే ప్రకటనలు, అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చే ప్రయత్నాలు మానుకుని, న్యాయవ్యవస్థపై విశ్వాసం ఉంచి చట్టపరమైన ప్రక్రియ పూర్తయ్యే వరకు సహనం పాటించాలని బొగ్గుల తిక్కన్న కార్తికేయ విజ్ఞప్తి చేశారు.

